# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక






అమలాపురం | సంపుటి : 10 సంచిక : 25 | ఎడిటర్ : ఎ.రాజశేఖర్ | సోమవారం 17 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-


published : Amlapuram Vol:10 Issue : 25 17-03-2025 Edirtor : A. RAJASEKHAR Pages : 8 Rs: 5/-


# రాజధానిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం

## సీఎం చంద్రబాబు

**అమరావతి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళులు అర్పించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి నారాయణ, దూండీ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. "పొట్టి శ్రీరాములు 58 రోజుల దీక్షకు గుర్తుగా రాజధానిలో 58 అడుగుల విగ్రహం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం. స్మారక పార్కు ఏర్పాటు చేస్తాం. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఆయన స్వగ్రామం అభివృద్ధికి చర్యలు చేపడతాం. అక్కడ మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఆయన పేరుతో ఆధునిక ఉన్నత పాఠశాల నిర్మిస్తాం. ఈ ఉగాది నుంచి పీ-4 విధానం ప్రారంభిస్తున్నాం. ఆర్థిక అసమానతలు తొలగించేందుకే ఈ విధానం. ప్రతి ఒక్కరూ పొట్టిశ్రీరాములు స్ఫూర్తితో పనిచేయాలి. ప్రతి ఒక్కరూ 10 మంది తెలుగువారిని పైకి తేవాలి. ఏడాది పాటు పొట్టి




శ్రీరాములు జయంతి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది మార్చి 16 వరకు వీటిని నిర్వహిస్తాం" అని చంద్రబాబు అన్నారు.

# చంద్రబాబు సమక్షంలో హడ్కో-సీఆర్‌డీఏ మధ్య ఒప్పందం

**అమరావతి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో)-సీఆర్‌డీఏ మధ్య ఒప్పందం జరిగింది. ఒప్పందం ప్రకారం రాజధాని అమరావతిలో నిర్మాణాలకు హడ్కో రూ.11వేల కోట్ల రుణం ఇవ్వనుంది. ఈ మేరకు ఈ జనవరి 22న ముంబయిలో నిర్వహించిన హడ్కో బోర్డు సమావేశంలో అంగీకారం తెలిపారు. ఒప్పందం పూర్తయిన నేపథ్యంలో త్వరలో ఆ నిధులను విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, హడ్కో సీఎండీ సంజయ్ కుల్‌శ్రేష్ఠ పాల్గొన్నారు.



# నేడు అమరావతి పనులకు పచ్చ జెండా ఊపనున్న కేబినెట్

**అమరావతి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రేపు అమరావతి పనులకు పచ్చ జెండా ఊపనున్న కేబినెట్ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశం కానుంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో అమరావతి అభివృద్ధి, పరిశ్రమల పెట్టుబడులు, భూకేటాయింపులు, ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటు వంటి అనేక కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు.

**అమరావతి నిర్మాణానికి భారీ బడ్జెట్ %-% టెండర్లకు కేబినెట్ ఆమోదం**

అమరావతి నిర్మాణ పనుల కోసం సీఆర్డీఏ (CRDA) రూ.37,072 కోట్ల టెండర్లకు అనుమతి ఇవ్వనుంది. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ADC) చేపట్టిన రూ.15,081 కోట్ల ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. అమరావతిలో పలు సంస్థలకు భూముల కేటాయింపుకు కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

**ఏపీకి పెట్టుబడుల ప్రవాహం %-% భారీ పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం**

10 ప్రముఖ సంస్థల ద్వారా రాష్ట్రానికి రూ.1,21,659 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ పెట్టుబడుల వల్ల ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. కేబినెట్ సమావేశంలో పెట్టుబడులకు సంబంధించి సానుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు %-% 26 జిల్లా కేంద్రాల్లో ప్రాథమిక అమలు

రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ప్రాథమిక దశలో 26 జిల్లా కేంద్రాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేయనున్నారు. ఈ పార్కుల ద్వారా చిన్నతరహా పరిశ్రమలను

- తరువాయి 2లో..



# పదో తరగతి యువ నేస్తాలకు ఆల్‌ది బెస్ట్ : చంద్రబాబు

**అమరావతి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పదో తరగతి యువ నేస్తాలకు శుభాకాంక్షలు : చంద్రబాబు ఏపీలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యార్థులకు ప్రోత్సాహకరమైన సందేశం ఇచ్చారు. పరీక్షలు విద్యార్థి జీవితంలో కీలకమైన మైలురాళ్లు %-% సీఎం చంద్రబాబు పదో తరగతి విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ చంద్రబాబు పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో కీలక మైలురాళ్లు అని పేర్కొన్నారు. పరీక్షలపై పూర్తిగా దృష్టి పెట్టండి, కష్టపడి చదవండి, సమయాన్ని సద్వినియోగం చేసుకోండి, మీపై మీరు నమ్మకం పెట్టుకోండి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం దానంతట అదే వస్తుంది విద్యార్థులు బాధ్యతగా చదివి మంచి ఫలితాలు సాధించాలని సీఎం సూచించారు. ఏపీ ప్రభుత్వం పదో తరగతి పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు జరుగుతాయి ప్రతి పరీక్ష కేంద్రంలో కఠిన భద్రతా చర్యలు తీసుకున్నారు మాలప్రక్రియలను అరికట్టేందుకు 144 సెక్షన్ అమలు చేయనున్నారు

**విద్యార్థులకు సీఎం చంద్రబాబు సూచనలు**

చదువు కోసం కష్టపడే ప్రతి విద్యార్థి విజయం సాధిస్తాడని సీఎం

- తరువాయి 2లో..



# నేటి నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే హాల్ టికెట్లను జారీ చేసింది. విద్యార్థులు హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గతంలో తీసుకొచ్చిన ఆంగ్ల మాధ్యమంతోపాటు, తొలిసారిగా ఎన్‌సీఈఆర్టీ సిలబస్ ఆధారంగా ఈ పరీక్షలు జరుగుతున్నాయి. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు మొత్తం 7 పేపర్లకు పరీక్షలు నిర్వహించనున్నారు.

**పరీక్షల ప్రత్యేక ఏర్పాట్లు:**

రాష్ట్ర వ్యాప్తంగా 6,19,275 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 5,64,064 మంది విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో, 51,069 మంది విద్యార్థులు తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాయనున్నారు. సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 30,334 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 3,450 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు (అన్ని ప్రధాన పేపర్లు) ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లకు ఉదయం 9:30 నుంచి 11:30 వరకు మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వం పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షల నిర్వహణ పర్యవేక్షణ కోసం 156 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 682 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. విద్యార్థులకు 24 పేజీల జవాబు బుక్‌లెట్ ఇవ్వనున్నారు. అదనంగా కావాలంటే మరో 12 పేజీల బుక్‌లెట్ కూడా అందుబాటులో ఉంటుంది.

**సిలబస్, మార్పులు**

2020-21 విద్యాసంవత్సరంలో ప్రభుత్వం 1-6 తరగతులను ఆంగ్ల మాధ్యమానికి మార్చింది. 6వ తరగతి నుంచే ఎన్‌సీఈఆర్టీ సిలబస్ అమలు చేయడంతో, ఇప్పుడు పదో తరగతికి వచ్చిన విద్యార్థులు తొలిసారిగా ఈ సిలబస్‌లో పరీక్షలు రాస్తున్నారు. సీబీఎస్‌ఈ తరహాలో 20% ఇంటర్నల్ మార్కులు ఉంటాయి. అయితే, ఈ సంవత్సరం వంద మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 20% ఇంటర్నల్ మార్కులు అమల్లోకి రానున్నాయి. సీబీఎస్‌ఈ బోర్డులో ఐదు సబ్జెక్టులు మాత్రమే

- తరువాయి 2లో..

# ప్రధాని మోదీతో లెక్స్ ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్.. నేడే విడుదల

ప్రధాని నరేంద్ర మోదీ మరో పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అమెరికాకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధకుడు, పాడ్‌కాస్ట్ హోస్ట్ లెక్స్ ఫ్రిడ్‌మాన్ దీన్ని నిర్వహించారు. మోదీ స్వయంగా ఈ విషయాన్ని ఎక్స్ ద్వారా వెల్లడించారు.



ప్రధాని మోదీతో తాను త్వరలోనే పాడ్‌కాస్ట్ నిర్వహిస్తానని ఫ్రిడ్‌మాన్ జనవరిలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో మోదీతో ఆయన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ నిర్వహించారు. అందులో తన చిన్ననాటి విషయాలు, హిమాలయాల్లో గడిపిన రోజులు, ప్రజాజీవితంలో తన ప్రయాణం సహా అనేక విషయాలను గురించి చర్చించినట్లు మోదీ పేర్కొన్నారు. ఇక, దీన్ని ఆదివారం విడుదల చేయనున్నట్లు ఫ్రిడ్‌మాన్ తెలిపారు. తన జీవితంలో అద్భుతమైన ఇంటర్వ్యూల్లో ఇది ఒకటి అని ఆయన వెల్లడించారు.

- తరువాయి 2లో..

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# విపత్తు నేర్పే పాఠం!

ఇటీవల కాలపు ప్రపంచ అతి పెద్ద ఆరోగ్య విపత్తు కోవిడ్ 19ని ఎదుర్కొని అప్పుడే ఐదేళ్లు గడిచిపోయాయి. 2020 మార్చి 11వ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) కోవిడ్‌ని పెను విపత్తుగా ప్రకటించటంతో అన్ని దేశాలూ అప్రమత్తమయ్యాయి. దేశాల మధ్య, పట్టణాలు నగరాల మధ్య, గ్రామాల మధ్య, ఆఖరికి మనిషికీ మనిషికి మధ్య భౌతిక దూరం అనివార్యమై, కనీవినీ ఎరగని పరిస్థితి నెలకొంది. ఎల్లెడలా భయాందోళనలు అలముకున్నాయి. రోజువారీ జీవనం అస్తవ్యస్తమైపోయింది. మన దేశంలో మోడీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు ఏర్పాట్లూ చేయకుండానే లాక్‌డౌన్ ప్రకటించటంతో కోట్లాదిమంది వలస కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. లక్షలాది మంది రోజుల తరబడి వందల కిలోమీటర్ల దూరం నడిచి, నానా ఇక్కట్లూ ఎదుర్కొన్నారు. అలాంటి సమయంలో దాహార్తికి నీరై, పగుళ్లు దేరిన కాళ్లకు చెప్పులై, నెత్తిన గొడుగులై, ఆకలికి ఇంత అన్నమై వలస జీవులను ఆదుకోవటానికి తోటి మనుషులు తోడై నిలిచిన తీరు గొప్ప మానవతా దృక్పథానికి అద్దం పట్టింది.

కోవిడ్ రెండో దశలో వ్యాధి ప్రభావం ఎక్కువై, మరణాలు సంభవించినప్పుడు కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల ధనదాహం కంపరం పుట్టించింది. ఆధునిక వైద్య విజ్ఞానంతో ఆదుకోవాల్సిన ప్రభుత్వ పెద్దలు కంచాలు వాయించమని, చప్పట్లు కొట్టమని, దీపాలు వెలిగించమని చేసిన ప్రహసనం ప్రపంచం ముందు నవ్వుల పాలైంది. విపత్తు తీవ్రతను తక్కువగా అంచనా వేసి, ప్రజల ప్రాణాలను పరిహాసం చేసిన దేశాధినేతల్లో అప్పటి, ఇప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఉన్నాడు. ఘోర విపత్తు సమయంలోనూ ఆరోపణలూ అత్యోక్తులతో కాలహరణం చేయడం మన పాలకుల దగ్గరా కనపడింది. ప్రమాద తీవ్రతను, మరణాలను దాచిపెట్టటానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. దేశంలో దాదాపు 4 లక్షల 74 వేల మంది మరణించారని మోడీ ప్రభుత్వం ప్రకటిస్తే- భారతదేశంలో మరణాల సంఖ్య 47 లక్షల వరకూ ఉందని డబ్ల్యుహెచ్ఒ వెల్లడించింది. విపత్తు వేళ దాపరికమూ, గొప్పల వ్యాఖ్యానమూ కొనసాగిస్తే- అవసరమైన చర్యలు చేపట్టడం సాధ్యం కాకుండాపోతుందని కోవిడ్ అనుభవం తేటతెల్లం చేసింది. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ తయారీ, పంపిణీ విషయాల్లో సామ్రాజ్యవాద దేశాలు లాభాల దృష్టితో వ్యవహరించాయి. చిన్న దేశమైన సోషలిస్టు క్యూబా అందుకు భిన్నంగా వ్యాక్సిన్‌ను, తమ వైద్య బృందాల సేవలనూ పలు దేశాలకు నేరుగా అందించింది.

శాస్త్రవేత్తలు, వైద్యులు, నర్సులు, పారిశుధ్య కార్మికులు తదితరుల నిరంతర కృషితోనూ, సేవలతోనూ ప్రపంచం విజయవంతంగా కోవిడ్ మహమ్మారిని తిప్పికొట్టింది. వైద్య వైజ్ఞానిక రంగం ఇలాంటి విపత్తులను ఎదుర్కొని, పైచేయి సాధిస్తుందని మరోసారి రుజువైంది. వ్యవస్థలను, కుటుంబాలను కోవిడ్ అనేక విధాల నష్టపరిచినా చిట్టచివరకు దానినుంచి బయటపడి ముందుకు సాగటం మానవ సమాజ సమిష్టి విజయం.

అయితే, ఇలాంటి ఘోర ఆరోగ్య విపత్తు నుంచి దేశాలూ ప్రభుత్వాలూ ఎన్నో గుణపాఠాలు నేర్చుకోవాలి. వ్యవస్థలు కార్పొరేటు శక్తుల చేతుల్లో ఉండడం, స్వార్థం, బాధ్యతారాహిత్యం, పర్యావరణ హననం వంటివి విపత్తుల వేళ కష్టాలను మరింత పెంచుతాయని గ్రహించాలి. ప్రతి వైపరీత్యంలోనూ కాసులు గడించుకునే కార్పొరేట్ వ్యాపార నమూనా సర్వజన హితానికి ఏమాత్రమూ పనికి రాదని అర్థం చేసుకోవాలి. ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు ఆదుకునేది, అస్త్రశస్త్రాలను అందించేది వైజ్ఞానిక శాస్త్రం, శాస్త్రీయమైన సమిష్టి ఆచరణ తప్ప- గతాలూ, వాటి గొప్పతనాలూ కానేకాదని ఒప్పుకోవాలి. కానీ, పాలకులకు అలాంటి పాఠాలు తలకెక్కినట్టు లేదు. ఆరోగ్య ఆపత్కాలంలో కీలకంగా వ్యవహరించాల్సిన ప్రపంచ ఆరోగ్య సంస్థను బలోపేతం చేసే బదులు దానిని నిర్వీర్యపర్చటానికే అమెరికా పూనుకుంటోంది. మనదేశంలోనూ విద్యా వైద్య వైజ్ఞానిక రంగాల్లో పరిశోధనలు పెంచి, ఆయా వ్యవస్థలను మెరుగుపర్చటానికి తగిన నిధుల కేటాయింపు జరగటం లేదు. విపత్తులు విరుచుకుపడ్డప్పుడు హడావిడి పడడం కాదుబీ అవి తలెత్తకుండా చూడడం, తారసపడితే తగు రీతిలో ఎదుర్కోవటం మన కర్తవ్యంగా ఉండాలి. ఇదే విపత్తుల నుంచి విజ్ఞులు నేర్వాల్సిన పాఠం!

# పరీక్షలే జీవితం కాదు.. ఆల్ ది బెస్ట్

## హోంమంత్రి అనిత



అమరావతి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ హోంమంత్రి అనిత పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు సూచనలు చేశారు. పరీక్షలు జీవితంలో కీలకమైనవే కానీ, అవే జీవితం కాదని ఆమె అన్నారు. విద్యార్థులు టెన్షన్ లేకుండా ప్రశాంతంగా ఉండి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. కఠినంగా శ్రమించి చదివిన విద్యార్థులు తమ ప్రతిభను పూర్తిగా ప్రదర్శించాలని కోరారు.

**టెన్షన్ వద్దు.. ఆత్మవిశ్వాసంతో ముందుకు**

ఎంతో శ్రమించి, రోజువారీ సమయాన్ని చదువుకు కేటాయించిన విద్యార్థులు పరీక్షల వేళ ఒత్తిడికి గురికావద్దని హోంమంత్రి తెలిపారు. ప్రతి ప్రశ్నకు సక్రమమైన, నైపుణ్యంతో కూడిన సమాధానం ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు మానసిక మద్దతుగా నిలవాలని ఆమె పేర్కొన్నారు.

**పరీక్ష కేంద్రానికి ముందుగా చేరుకోవాలి**

పరీక్షల రోజున విద్యార్థులు అల్లాడిపోకుండా, సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రానికి వెళ్లాలని హోంమంత్రి సూచించారు. పరీక్ష ముందు మానసిక ప్రశాంతత అవసరమని, ఒత్తిడిని దూరంగా ఉంచుకోవడం ద్వారా పరీక్షలను సాఫల్యంగా రాయగలమని చెప్పారు. ప్రశ్నపత్రాన్ని అర్థం చేసుకొని సమయాన్ని సరిగ్గా వినియోగించుకోవాలని ఆమె కోరారు.

**అభ్యర్థులకు శుభాకాంక్షలు**

పదోతరగతి పరీక్షలు రాసే ప్రతి విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, తాము నిబద్ధతతో సాధించిన విజయం భవిష్యత్తులో మంచి ఫలితాలను అందిస్తుందని హోంమంత్రి అనిత తెలిపారు. 'ఆల్ ది బెస్ట్' అంటూ విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించారు. పరీక్షలను ఓ అవకాశంగా భావించి, దృష్టి నిలిపి విజయాన్ని సాధించాలని సూచించారు.

# రొయ్య రైతుల బేజారు

## ధర పతనంతో నష్టాలు



అమరావతి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గత నెలలో ఆశాజనకంగా ఉన్న రొయ్యల ధరలు ప్రస్తుతం ఒక్కసారిగా పతనమయ్యాయి. ఎగుమతులు లేవనే పేరుతో వ్యాపారులు సిండికేటై ధరలను తగ్గించేశారని రైతులు వాపోతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 20.614 మంది రైతులు సుమారు 75 వేల ఎకరాల్లో రొయ్యలను సాగు చేస్తున్నారు. అత్యధికంగా కోనసీమ జిల్లాలో 50 శాతం, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలో మిగిలిన 50 శాతం రొయ్యలు సాగవుతున్నాయి. గత నెలలో వంద కౌంట్‌కు రూ.255 ధర వచ్చింది. ప్రస్తుతం రూ.రూ.220 మించడంలేదు. 90 కౌంట్‌కు గత నెలలో రూ.265కి ధర లభించింది. ప్రస్తుతం రూ.235 మాత్రమే వస్తోంది. 80 కౌంట్ ధర గత నెలలో రూ.285 ఉంది. ప్రస్తుతం రూ.250కు పడిపోయింది. 70 కౌంట్ ధర రూ.325 నుంచి రూ.285, 60 కౌంట్ ధర రూ.345 నుంచి రూ.315కు కొనుగోలుదారులు తగ్గించేశారు. 50 కౌంట్ ధర రూ.375 నుంచి రూ.335కు పతనమైంది. 40 కౌంట్ ధర రూ.415 నుంచి రూ.350కు పడిపోయింది. జిల్లా నుంచి చైనా, యూరప్, కొరియా దేశాలకు రొయ్యలు ఎక్కువగా ఎగుమతులు జరుగుతున్నాయి. ఆక్వా రైతులను గత కొన్నేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలు నష్టాల బాట పట్టించాయి. గత నెలలో ఆశాజనక పరిస్థితులు నెలకొనడంతో ఉత్సాహంగా సాగు ప్రారంభించిన రైతులకు వేసవి సాగు కష్టాలు తప్పవనే సంకేతాలు కనిపిస్తున్నాయి. రొయ్యల మేత ధరలు ఏటా పెరుగుతుండడం, ఆశాజనక ధర లభించకపోవడం వంటి వరుస పరిణామాలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. ఈ నేపథ్యంలో ధరలు నిలకడగా లేకపోతే నష్టాలు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 280 వరకూ హేచరీలు ఉన్నాయి. హేజరీలు అధిక ధరకు నాసిరకం ఫీడ్‌ను అంటగడుస్తున్నాయి. దీన్ని చెరువుల్లో వేసిన పది రోజులకు రొయ్య పిల్లలు విపరీతంగా చనిపోతున్నాయి. వాటిల్లో కొన్ని బతికి బయట పడినా సమాన గ్రోత్ రావడం లేదు. వాటిని అమ్మకుందామంటే రొయ్యల ప్రాసెస్ కంపెనీ వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి దోచుకుంటున్నారు. మత్స్యశాఖ అధికారులు నెలకు రెండుసార్లు మేచరీలను పరిశీలించి ఆయా యజమానులకు నాణ్యమైన సీడ్ ఉత్పత్తులపై పలు సూచనలు సలహాలు ఇవ్వాలి. కొన్ని నెలలుగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. మరోవైపు రొయ్యలకు వినియోగించే మేత ప్రొ బయాటిక్స్, ఇతర మందుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి.

# పుతిన్‌తో ట్రంప్ రేపు కీలక భేటి

వాషింగ్టన్ : ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగింపు పలకడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మాట్లాడనున్నట్లు తెలిపారు. ఎయిర్ ఫోర్స్ వన్‌లో ఫ్లోరిడా నుండి వాషింగ్టన్‌కు వెళ్తున్న సందర్భంలో ట్రంప్ విలేకరులతో తెలిపారు. మంగళవారం పుతిన్‌తో మాట్లాడి యుద్ధం ముగించగలమో లేదో చూడాలనుకుంటున్నామని తెలిపారు. మూడు సంవత్సరాల క్రితం ఉక్రెయిన్‌ను తన దండయాత్ర ప్రారంభంలో రష్యా విఫలమైనప్పటికీ, అది ఇప్పటికీ దేశంలోని పెద్ద ప్రాంతాలను నియంత్రిస్తుంది. భూమి, విద్యుత్ ప్లాంట్ల యుద్ధాన్ని ముగించడం గురించి చర్చించనున్నామని ట్రంప్ పేర్కొన్నారు.



## నేడు అమరావతి పనులకు పచ్చ జెండా ఊపనున్న కేబినెట్

ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సంక్షిప్తంగా అమరావతి నిర్మాణం కోసం రూ.37,072 కోట్ల టెండర్లకు అనుమతి అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూ.15,081 కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం 10 సంస్థల ద్వారా రూ.1,21,659 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు %-% ముందుగా 26 జిల్లా కేంద్రాల్లో అమలు

## పదో తరగతి యువ నేస్తాలకు ఆల్‌ది బెస్ట్ : చంద్రబాబు

చంద్రబాబు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ధైర్యంగా ఉండి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు కీలకం. అందుకే, అందరూ పూర్తి సమయాన్ని చదువుపై కేంద్రీకరించాలని విద్యా శాఖ అధికారులు తెలిపారు. రేపటి పరీక్షలతో ఏపీ విద్యార్థుల కోసం మరో ముఖ్యమైన అధ్యాయం ప్రారంభం కానుంది!

## నేటి నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు

ఉండగా, రాష్ట్రంలో విద్యార్థులు ఆరు సబ్జెక్టులు చదువుతున్నారు. పరీక్షకు కనీసం 30 నిమిషాల ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకెళ్లాలి. బ్లాక్ లేదా బ్లూ బాల్‌పెన్ మాత్రమే ఉపయోగించాలి. ఎలక్ట్రానిక్ గ్యాజెట్లు, మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు అనుమతించరు. ప్రశాంతంగా, ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరయ్యేలా ప్లాన్ చేసుకోవాలి. ఈసారి పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యే ముందు అన్ని నియమాలను పాటించి, విజయవంతంగా పరీక్ష రాయాలని అధికారులు సూచించారు.

## ప్రధాని మోదీతో లెక్స్ ఫ్రిడ్‌మాన్ పాడ్‌కాస్ట్.. నేడే విడుదల

రష్యా మూలాలున్న ఫ్రిడ్‌మాన్ అమెరికాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పరిశోధకుడు. 2018 నుంచి 'లెక్స్ ఫ్రిడ్‌మాన్' పేరుతో పాడ్‌కాస్ట్‌లు నిర్వహిస్తున్నారు. సైన్స్, టెక్నాలజీ, స్పోర్ట్స్, రాజకీయ రంగాల్లోని ప్రముఖులతో ఇంటర్వ్యూలు చేస్తున్నారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలతో సహా అనేక మందిని ఇంటర్వ్యూ చేశారు. ఆయనకు యూట్యూబ్‌లో 4.5 మిలియన్ల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇదిలా ఉండగా.. ప్రముఖ వ్యాపారవేత్త జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో ఇటీవల మోదీ పాల్గొన్న సంగతి తెలిసిందే. అందులో రాజకీయాలు, వ్యవస్థాపకత, నాయకత్వ సవాళ్లు వంటి అనేక అంశాలపై ఇరువురూ చర్చించారు.

# పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



**విశాఖపట్నం మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమరజీవి పొట్టి శ్రీరాములు 124 వ జయంతి వేడుకలు ఆదివారం ఉదయం.ఫిషింగ్.హర్బారు బీచ్ రోడ్ దరి గల బాల వికాస ఫౌండేషన్ ప్రాంగణం లో వాసవి క్లబ్.గ్రేటర్ విశాఖ కపుల్స్ ఆధ్వర్యం లో ఘనంగా జరిగింది .తొలుత క్లబ్ అధ్యక్షులు డాక్టర్ రజని బాలవికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపాక కార్యదర్శి క్లబ్.సభ్యులు శ్రీరాములు చిత్ర ఫటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. క్లబ్.అధ్యక్షులు డాక్టర్ రజని మాటలాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ.కోసం స్వర్గీయ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు మరువలేని వని.శ్రీరాములు జీవిత చరిత్ర బాలలకు తెలపాలని అన్నారు .ఈ సందర్బంగా బాల లకు పలు పోటీలు నిర్వహించి బహుమతు లు అందజేశారు మరియు స్కూల్ కి విద్యా సామగ్రి అందజేశారు సమావేశం లో భాస్కర్ ...రూపవాని .మహాలక్ష్మి .నీవేదిత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి ఉడిపి రాట మహొత్సవం..



**గాజువాక మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జీవీఎంసీ 58వ వార్డు పరిధి శ్రీహరిపురం శివారు కోడిపందాలదిబ్బలో వెలసి ఉన్న నూతల తల్లి పండుగ మహొత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అమ్మవారి ఉడిపి రాట మహొత్సవాన్ని ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో వార్డు తెదేపా అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులతో పాటు స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం..

▸▸ ఎమ్మెల్యే గణబాబు..



**విశాఖపట్నం మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కేవలం నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యపడుతుందనే నమ్మకంతో రాష్ట్ర ప్రజలంతా కూటమి పార్టీలకు ఘన విజయాన్ని అందించారని ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఆదివారం గోపాలపట్నంలో గల తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత అంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ సంవత్సరంలోనికి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. చంద్రబాబు నాయుడు తన 47 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల విశ్వసనీయతను, సమర్థవంతమైన పాలన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న నాయకుడన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక లోటులో ఉన్నప్పటికీ అన్ని రంగాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు పలు పథకాలను అమలు చేస్తూ తద్వారా వారికి ఆర్థిక చేయూతనందిస్తున్నారన్నారు. విద్యుత్ ఉత్పత్తి 15 వేల మెగావాట్లకు పెంచగలిగారన్నారు. జగన్ ప్రభుత్వంలో ఏజెన్సీలో గంజాయి పండిస్తే కూటమి ప్రభుత్వంలో కాఫీ తోటలు పండించి తద్వారా పలువురికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఒక కోటి 30 లక్షల మందికి చంద్రన్న బీమా తొలగించారన్నారు. అన్నా కాంటీన్లు తొలగిస్తే కూటమి ప్రభుత్వంలో అవి పునః నిర్మాణం చేసి పేదవాడికి 5 రూపాయిలకే భోజనం అందజేయడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా రక్త దానం కార్యక్రమాలు నిర్వహిస్తూ రోగులకు సకాలంలో ఆ రక్తాన్ని అందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సమావేశంలో తెదేపా కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, కూటమి పార్టీల నాయకులు నారపిని సత్తిరాజు, యలమంచిలి ప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మాస్ కాపింగ్‌కు ప్రయత్నాలు? ఆందోళన చెందుతున్న మెరిట్ విద్యార్థులు

## పగడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ప్రజల విజ్ఞప్తి

**అరకులోయ మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నేడు ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ఇప్పటినుండే లోపాయికారి ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అరకులోయ,అనంతగిరి, డంబ్రిగుడ మండలాల్లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు,వివిధ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థులకు భారీగా ఉత్తీర్ణతా శాతం పెంచి ఉన్నతాధికారుల వద్ద ప్రశంసలు పొందాలన్నా సంకల్పంతో ఉపాధ్యాయులు పలు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. వార్డెన్ లకు, ప్రధానోపాధ్యాయులకు,ఇతర ఉపాధ్యాయులకు రహస్య సమావేశాలు నిర్వహిస్తూ పది పరీక్షల్లో ఏ విధంగా ఉత్తీర్ణతా శాతం పెంచాలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కూడా తెలియ వచ్చింది. ముఖ్యంగా 10 పరీక్షలు వ్రాసే విద్యార్థులతో మాస్ కాపీ చేయించాలన్న లక్ష్యంతో ఉపాధ్యాయులు ఉన్నట్లు సమాచారం. పది పరీక్షలు కట్టుదిట్టంగా, మాస్ కాపీయింగ్ తావు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, జాయింట్ కలెక్టర్ ఇప్పటికే అన్ని ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు. అధికారుల ఆదేశాలతో పరీక్షలు కట్టుదిట్టంగా జరిగితే ఉత్తీర్ణతా శాతం ఘననీయంగా తగ్గుతుందని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే లోపాయికారిగా బాహ్య ప్రపంచానికి తెలియకుండా మాస్ కాపీంగుకు తెర లేపాలన్న ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరు అవుతున్నప్పటికీ సకాలంలో పాఠ్యాంశాలు పూర్తి చేయలేదని కథనాలు ఇక్కడ విస్తృతంగా వినిపిస్తున్నాయి. పాఠ్యాంశాలు పూర్తి చేయకపోతే విద్యార్థులు 10 పరీక్షలు ఏ విధంగా సొంతంగా రాయగలుగుతారని తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఉత్తీర్ణత శాతం పెంపునకు ఉపాధ్యాయులు ప్రయత్నాలు చేస్తున్నారనే విషయం ఆ నోట ఈ నోట తెలుసుకుంటున్న బాగా చదివిన విద్యార్థులు ఆందోళన




చెందుతున్నారు. తాము కష్టపడి పరీక్షలు రాసి ర్యాంకులు తెచ్చుకుంటామని అయితే చదవకుండా ఉపాధ్యాయుల సహాయంతో ర్యాంకులు విద్యార్థులు తెచ్చుకుంటే తాము తీవ్ర నిరాశా నిస్పృహలకు గురికావలసి వస్తుందని మెరిటు విద్యార్థులు తల్లిదండ్రుల వద్ద వాపోతున్నారు. జిల్లా అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి పదో తరగతి పరీక్షలలో మాస్ కాపీంగుకు తావు లేకుండా పగడ్బందీగా, కట్టుదిట్టంగా నిర్వహించాలని ఈ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అప్పుడే మెరిట్ విద్యార్థులకు సరియైన న్యాయం జరుగుతుందని వారు అంటున్నారు. పరీక్షా కేంద్రాలలో ప్రత్యేక సిట్టింగ్ స్కడలను ఏర్పాటు చేయడమే కాకుండా, మొబైల్ స్కాడలను కూడా ఏర్పాటుచేసి పరీక్షలు కట్టుదిట్టముగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. లోపాయి కారి మాస్ కాపీయింగ్ వల్ల అనేక అనర్థాలు కూడా ఉన్నాయని ప్రజలు అధికారులకు గుర్తు చేస్తున్నారు.

# స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

## చిన్నారుల విద్యా యాత్రలో మరో మైలురాయి

**విశాఖపట్నం మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ మద్దిలపాలెం కృష్ణా కాలేజ్ రోడ్ లోని మెయిన్ బ్రాంచ్ లో UKG విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఎంతో భవ్యంగా, కనువిందుగా జరిగాయి. ఈ కార్యక్రమంలో 70 మంది %ఖఖ+% విద్యార్థులు రంగురంగుల గ్రాడ్యుయేషన్ డ్రెస్‌లలో తమ తల్లిదండ్రులు, తాతామామల సమక్షంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న చిన్న ముద్దు పిల్లల చిరునవ్వులు వారి ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించాయి. 2001లో స్థాపితమైన స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్, “బుక్స్ లేవు %–% హోంవర్క్ లేదు %–% రాతలు లేవు” అనే వినూత్న విధానంతో కేజీ విద్యకు ఒక కొత్త దిశను చూపింది. ఈ ప్రత్యేకమైన విద్యా






పద్ధతికి దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు లభించింది. ఇన్నోవేటివ్ మెథడాలజీకి దేశంలో ప్రథమ స్థానం పొందిన ఘనతను ఈ పాఠశాల సొంతం చేసుకుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక అవార్డులను గెలుచుకొని, పలువురు ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.

ఈ పాఠశాలకు అప్పటి భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి తదితర ప్రభుత్వ ప్రముఖుల నుంచి గుర్తింపు లభించింది. ఈ గ్రాడ్యుయేషన్ డే చిన్నారులకు ఆనందకరమైన విద్యా వాతావరణాన్ని అందించాలనే పాఠశాల యొక్క నిబద్ధతకు ప్రతీకగా నిలిచింది. ఇదే విధంగా స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ గాజువాక బ్రాంచ్ లో కూడా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు మాట్లాడుతూ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యతను వివరించారు. భవిష్యత్ గ్లోబల్ లీడర్స్‌గా పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, పాఠశాలలు కలసి తీసుకోవలసిన బాధ్యతలపై విశ్లేషణాత్మకంగా వివరణ ఇచ్చారు. స్కూల్ ప్రిన్సిపాల్ మళ్ల వాణిశ్రీ మాట్లాడుతూ తల్లిదండ్రులకు పాఠశాల అభివృద్ధిలో అందిస్తున్న సహకారం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకల్లో మళ్ల సర్వాణి, UKG టీచింగ్ టీమ్, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీరామ సంకీర్తనలతో శ్రీరామదాసు జయంతి



**విశాఖపట్నం మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

బీచ్ రోడ్డు శ్రీ ప్రసన్న రుక్మిణి సమేత పాండురంగ స్వామి దేవాలయంలో శ్రీ శారద అన్నమయ్య సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు పారుపల్లి సత్యనారాయణ సారధ్యంలో భద్రాచల శ్రీరామదాసు సంకీర్తనలతో శ్రీరామదాసు జయంతిని ఘనంగా నిర్వహించారు . భద్రాచల శ్రీరామదాసు జయంతిని సాహితీవేత్త విశ్లేషకులు పి శ్రీరామచంద్రమూర్తి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం వి రాజశేఖర్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు . అనంతరం శ్రీరామచంద్రమూర్తి భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ వాగ్గేయ కారులు శ్రీరామదాసు రచించిన శ్రీరామ నామంతో కూడిన శ్రీరామదాసు సంకీర్తనలను గానం చేయడం ద్వారా సీతా సమేతుడైన శ్రీ రామచంద్ర మూర్తి పరిపూర్ణ కటాక్షం లభిస్తుందన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ మాట్లాడుతూ మహానగర విశాఖలో శ్రీ శారద అన్నమయ్య సంగీత విద్యాలయానికి ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉండడమే కాకుండా శాస్త్రీయ సంగీత శిక్షణ సంస్థగా విశిష్టమైన కీర్తి లభించిందని తెలిపారు . భద్రాచల శ్రీ రామదాసు రచించిన సంకీర్తనలో ప్రత్యేకతను పొందిన నవరత్నాలుగా పిలవబడే 9 సంకీర్తనలను సంగీత గురువు పారుపల్లి సత్యనారాయణ వారి శిష్య బృందం మధురంగా ఆలపించి సభను రంజింపజేసి అందర్నీ ఆకట్టుకున్నారు . వేడుకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిపద్మావతి , కుమారి పి శారద , నేత్ర వైద్యులు డాక్టర్ ఏవిఎన్ శెట్టి , ఆలయ అర్చకులు శ్రీరామశర్మ నగరానికి చెందిన పలువురు ప్రముఖులు , సంగీత కళాభిమానులు పాల్గొన్నారు . కార్యక్రమంలో భాగంగా శ్రీరామదాసు జయంతిని పురస్కరించుకుని శ్రీరామునికి అర్చన అష్టోత్తర పూజ నిర్వహించి కుమారి మరియు సుధా సుందరకాండ గానం చేశారు .








తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
సోమవారం 17 మార్చి 2025

## నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు

**అమలాపురం, మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు అస్కారం లేకుండా అవస రమైన చర్యలు తీసుకుంటూ సజావుగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ విధించాలని చెప్పారు. జిరాక్ , నెట్ సెంటర్లన్నీ మూసి ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థిని విద్యా ర్థులకు పరీక్షా కేంద్రాలలో అన్ని కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు వైద్య శిబిరాలు ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పెయిన్ కిల్లర్ ఔషధాలతో నిర్వహించా లన్నారు. విద్యుత్ శాఖ నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. పోలీస్ శాఖ ప్రశ్నావళి జవాబు పత్రాలు తరలిం పులో భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే తాసిల్దారు వారి సూచనల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. ఆర్టీసీ వారు హాల్ టికెట్ చూపిన వి ద్యార్థులను ఉచితంగా బస్సులలో ప్రయాణించే ఏర్పాటు చేయాలని పరీక్షా కేంద్రాల రూట్లు లో బస్సులు నడపాలని ఆదేశించారు. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను పర్యవేక్షణ కొరకు నియ మించడం జరిగిందన్నారు .సమస్యాత్మకంగా గుర్తించిన పసలపూడి, మొగలి కుదురు, కొత్తపేట పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 19,217 విద్యా ర్థులకు పరీక్షలు రాయనున్నారని వీరి కొరకు 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపా రు.

## సోమవారం మార్చి 17 న కలెక్టరేట్ లో పి జి ఆర్ ఎస్

## కలెక్టర్ పి ప్రశాంతి



**రాజమహేంద్రవరం మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యలు పరిష్కార వేదిక పి జి ఆర్ ఎస్ కార్యక్రమం మార్చి 17 వ తేదీ సోమవారం యధావిధిగా కలక్టరేట్ , డివిజన్, మండల కేంద్రంలో, మునిసిపల్ కార్పొరేషన్ పురపాలక సంఘం పరిధిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్లో అదే విధంగా డివిజన్, మునిసిపల్ , మండల కేంద్రంలో ఉదయం 10.00 నుంచి మ.1.00 వరకు ప్రజల నుంచి పీజీఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు , జిల్లా, డివిజన్ మండల, మునిసిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు జయంతి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే సత్యానందరావు

**కొత్తపేట మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని వాడపాలెం కార్యాలయం వద్ద శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్,సాదే శ్రీనివాస్,మెర్ల గోపాలం,విల్లా మారుతి,బీరా ఇసాక్,గనిశెట్టి వీరేష్,కాస సాగర్,ముద్రగడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## అమలాపురం యాదవ సంఘం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం.

### నూతన కార్యవర్గం ఎన్నిక

**అమలాపురం, మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం యాదవ సంఘం అధ్యక్షులు కైల శోభనబాబు ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిభిరం ఏర్పాటు చేశారు. వేసవి కాలం సందర్భంగా అమలాపురం గవర్నమెంట్ హాస్పిటల్ లో రక్త నిల్వలు లేకపోవడం తో బ్లడ్ సెంటర్ సిబ్బంది కోరిక మేరకు ఆదివారం అమలాపురం యాదవ సంఘం అధ్యక్షులు శోభనబాబు పిలుపుతో ఓడలరేవు యాదవ యూత్ అధిక సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు మట్ట రాంబాబు, తానింకి అంజి, మందపాటి వీరబాబు, గొర్ల బాబి బ్రదర్స్, బూర సతీష్ బ్లడ్ సెంటర్ సిబ్బంది దొడ్డా కాశీ, చొల్లంగి రాజ శేఖర్ ,యెల్లమిల్లి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యాదవ సంఘం నూతన కార్యవర్గం సమావేశం ఆదివారం అమలాపురంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న యాదవులకు జనాభా ప్రాతిపదికన రాజకీయ రంగంలో యాదవులకు సముచిత స్థానం కల్పించాలనీ కోరారు. ఈ సంబర్బంగా నూతన కార్యవర్గం ఎన్నిక అయ్యారు. నూతన కార్యవర్గంలో గౌరవాధ్యక్షులు గా కోరశిఖ వీర వెంకట సుబ్రమణ్యం అధ్యక్షులు బర్ల శ్రీనివాస్ యాదవ్ ఉపాధ్యక్షులు మందపాటి వెంకటేశ్వర రావు ప్రధాన కార్యదర్శి గుండుమేను ప్రసన్న మణికంఠ స్వామి సంయుక్త కార్యదర్శి సూరిబోయిన సుబ్రమణ్యం ట్రెజరర్ పాశం చింతారావు జిల్లా యువజన అధ్యక్షులుగా మందపాటి బాలు యాదవ్, మహిళా అధ్యక్షురాలిగా చేకూరి లక్ష్మి, ఎన్నిక అయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ పెద్దలు యువత పాల్గొన్నారు.



## పొట్టి శ్రీరాములు త్యాగం ఎనలేనిది



**అమలాపురం, మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భాషా ప్రయుక్తరాష్ట్రాల ఏర్పాటు కోసం అమ రజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీ యమని జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాల నాధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావు పే ర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ నందు అమరజీవి పొట్టి శ్రీరాములు125 వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కలెక్టరేట్ నందు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ పొట్టి శ్రీరాములు త్యాగం ఎనలేనిదన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన కృషి చిర స్మరణీయమని కొనియా డారు. ఆయన పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాల న్నారు. ఆయన త్యాగ ఫలితంగా 1956 నవం బరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని కొనియాడా రు. భాషాప్రయుక్త రాష్ట్రా ల ఏర్పాటుకు శ్రీరాములు ఆద్యులన్నారు.తెలుగు రాష్ట్ర సాధన కోసం ప్రా ణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శమ న్నారు.ఆయన కృషితేనే తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు మహాత్మాగాంధీ బోధిం చిన సత్యం, అహింస, హరిజనోద్ధర ణకు జీవి తాంతం కృషిచేశారని, అమరజీవి పొట్టి శ్రీరా ములు ఆశయ సాధన కోసం అందరం పునరంకి తమవుదామన్నారు. తెలుగు వారందరూ నిత్యం స్మరించుకోదగిన మహానుభావుడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన ఆత్మత్యాగం తెలుగువారి దృఢసంకల్పానికి నిదర్శ న మన్నారు.ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆ మహనీ యునికి ఘన నివాళి అర్పించారు.ఆయన స్వాతంత్ర్య సమరయో ధుడని మంచి ఉద్యోగం, ఆస్తిపాస్తులను వదిలేసు కుని దేశం కోసం పోరాడి న మహనీయుడని మహాత్మాగాంధీజీకి ఇష్టమైన వ్యక్తని. 1930 లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభ వించాడన్నారు. ఉప్పు సత్యా గ్రహ, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 3 సార్లు జైలుశిక్ష అనుభవించారన్నారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కృష్ణ కాంత్, శేఖర్ ప్రదీప్, జి రాజు తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు దుర్మరణం



**గంగవరం, మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గంగవరం గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. గంగవరం నుండి అడ్డతీగల వెళ్లేదారిలో నెమలిచెట్టు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢకొని ఇద్దరు అక్కడికక్కడే మతి చెందారు. అడ్డతీగల గ్రామం గొర్లె శేఖర్, వై రామవరం మండలం బూరుగుపాలెం గ్రామం కారం శ్రీనివాస్ ఎదురెదురుగా బైకలు వస్తూ ఒకరినొకరు ఢకొట్టడంతో ప్రమాదం జరిగింది .ఈ ప్రమాదంలో వై.రామవరం ఆస్పత్రిలో డేటా ఎంట్రీగా పనిచేస్తున్న అడ్డతీగలకు చెందిన గొర్లె శేఖర్, బూరుగుపాలేనికి చెందిన శ్రీనివాస్ సంఘటనాస్థలిలోనే మృత్యువాత పడ్డారు.ఈ ప్రమాదంలో మరో మహిళకు, బాలునికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి, క్షతగాత్రులను రంపచోడవరం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గంగవరం ఎస్ఐ వెంకటేశ్వరరావు, సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉత్కంఠ భరితంగా ఎడ్ల పరుగు ప్రదర్శన

**సామర్లకోట, మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మండలంలోని కాపవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన రామలింగేశ్వర రాష్టస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. తొలుత ఎడ్ల ప్రదర్శనను కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), టిడిపి నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ ప్రారంభించారు. సీనియర్ విభాగంలో 6 జతలు, జూనియర్స్ విభాగంలో 31 జతలు పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో ప్రథమ, తృతీయ స్థానంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోరా శ్రుతిచౌదరి ఎడ్ల జతలు నిలిచాయి. ద్వితీయ స్థానాన్ని కాకినాడ జిల్లా ధర్మవరంకు చెందిన జువ్వల సత్తిబాబు ఎడ్ల జత నిలిచింది. జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని సామర్లకోటకు చెందిన పాలచర్ల కళ్యాణ్‌కుమార్ ఎడ్ల జత దక్కించుకుంది. ద్వితీయ, తృతీయ స్థానాలను కాపవరంకు చెందిన కుంచం మనోజ్ ఎడ్ల జత, కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్‌శ్రీ మణికంఠ ఎడ్ల జతలు దక్కించుకున్నాయి. న్యాయ నిర్ణేతలుగా సిద్దా నానాజీ, చేకూరి రామకృష్ణ, మనమల కృష్ణ, కంటే ఫణికుమార్ వ్యవహరించారు. విజేతలకు తుమ్మల రామస్వామి, నిమ్మకాయల రంగనాగ్ బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కుంచం శ్రీనివాస్, కుంచం సతీష్, బాబ్జీ టిడిపి జనసేన, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## గోపాలపురంలో డయేరియా కలకలం



**గోపాలపురం మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మండలంలో డయేరియా ప్రబలింది. మూడు రోజుల వ్యవధిలో సుమారు 32 డయేరియా కేసులు గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంకు రాగా పేషెంట్లకు వైద్యం అందించారు. వైద్యం పొందిన వారిలో 25 మంది కోల్కొవడంతో డిశ్చార్జ్ చేయగా ఏడుగురు ప్రస్తుతం వైద్యం పొందుతున్నారని, వీరి ఆరోగ్యం కూడా నిలకడగా ఉందని డిఎం అండ్ హెచ్ఓ కె.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. డిప్యూటీ డిఎం హెచ్ఓ జె.సంధ్యతో కలిసి గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం పొందుతున్న డయోరియా పేషంట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. పేషంట్లను ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి డాక్టర్లు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి డయేరియా కేసులపై ఆరా తీశారు. డయేరియా కేసు నమోదైన గ్రామాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామాలలో చేయవలసిన సర్వేలు, విధివిధానాలను వారికి వివరించారు. అనంతరం విలేకరులతో డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడారు. గత కొన్ని రోజులుగా మండలంలో సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్నదేవరపేట పిహెచ్‌సి, హుకుంపేట పిహెచ్‌సి పరిధిలో సుమారు 30 డయోరియా కేసులు నమోదైనట్లు తెలిపారు. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో 1 కేసు నమోదైనట్టు తెలిపారు. వారందరికీ గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందించినట్లు తెలిపారు. మండలంలో పొగాకు పనులకు వచ్చిన కూలీలకు డయోరియా వచ్చినట్లు తెలిపారు. అందుకు గల కారణాలు తెలుసుకునేందుకు, డయేరియా కేసులు గుర్తించేందుకు 20 ప్రత్యేక మెడికల్ టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పది మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎపిడమాలజిస్ట్, ఎపిడెమిక్ టీములు వాటర్, స్టూలు శాంపిల్స్, పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామాలలో సర్వే లైన్స్ వైద్య సిబ్బంది డయేరియా కేసులపై సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఆర్డబ్ల్యుఎస్, డిపిఒ, ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఏదైనా అనుమానం ఉన్న, వాంతులు, విరేచనాలు లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.ప్రభుత్వాసుపత్రిని సదర్శించిన ఆర్‌డిఓగోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం పొందుతున్న డయేరియా పేషెంట్ల వద్దకు కొవ్వూరు ఆర్‌డిఓ రాణి సుస్మిత ఆదివారం రాత్రి వచ్చి ఆరోగ్య పరిస్థితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డయేరియా నమోదైన అన్ని గ్రామాల నుండి రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పలు శాఖ అధికారులతో కలిసి సాయిల్ టెస్ట్, వాటర్ టెస్ట్, పొగాకు శాంపిల్స్ కలెక్ట్ చేసి టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డిఓ వెంట తహశీల్దారు అజరు బాబు, వ్యవసాయ శాఖ ఎడి చంద్రశేఖర్, ఎఒ రాజారావు, ఆర్ఐ హరీష్, డాక్టర్ దేవిశ్రీ పాల్గొన్నారు.

## ఆదిత్య ఆధ్వర్యంలో బీచ్ క్లీనప్ డ్రైవ్



**గండేపల్లి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ ఆదిత్య యూనివర్సిటీ సూరంపాలెం ఆధ్వర్యంలో బీచ్ క్లీనప్ డ్రైవ్ నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, సముద్ర కాలుష్య నివారణ, మరియు సామాజిక బాధ్యత పై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరాక్ట్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు కలిసి తీర ప్రాంతాన్ని శుభ్రం చేయడం ద్వారా సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సహాయపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యార్థులను వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్టర్ డాక్టర్ జి.సురేష్, డీన్ క్యాంపస్ లైఫ్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్, రోట్రాక్ట్ క్లబ్ సభ్యులు వి.వి.శ్రీమన్నారాయణ అభినందించారు.

# నైట్ క్లబ్‌లో అగ్నిప్రమాదం.. 50 మందికి పైగా మృతి



యూరప్‌లోని నార్త్ మెసిడోనియాలో నైట్ క్లబ్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 50 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. మరో 100మందికిపైగా గాయపడినట్లు అంతర్గత మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గంటలు గడిచినా మంటలు అదుపులోకి రాలేదని సమాచారం. నార్త్ మెసిడోనియా రాజధాని స్కోప్జేకు సుమారు 100కి.మీ దూరంలో కొకాని అనే పట్టణంలోని పల్స్ క్లబ్‌లో శనివారం రాత్రి జరిగిన కాన్సర్ట్‌లో దాదాపు 1500 మంది పాల్గొన్నారు. అయితే, ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఈవెంట్‌లో మండే స్వభావం కలిగిన వస్తువుల వాడటంతోనే సీలింగ్‌కు నిప్పు అంటుకొందని ప్రాథమికంగా నిర్ధరించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

# ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైన క్రూ-10



**తొమ్మిది నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌లు త్వరలోనే భూమ్మీదకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. వారిని తిరిగి తీసుకొచ్చేందుకు నాసా- స్పేస్‌ఎక్స్‌లు ప్రయోగించిన క్రూ-10 మిషన్ ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానమైంది. ఆదివారం ఉదయం 9: 37 గంటలకు ఈ ప్రక్రియ జరిగినట్లు నాసా వెల్లడించింది. దీనికి సంబంధించిన వీడియోను స్పేస్‌ఎక్స్ పంచుకుంది.**

### నింగిలోకి స్పేస్‌ఎక్స్ వ్యోమనౌక

సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ స్థానంలో తాజాగా అక్కడికి వెళ్లిన నలుగురు వ్యోమగాములు పనిచేయనున్నారు. క్రూ డ్రాగన్ వ్యోమనౌక శనివారం తెల్లవారుజామున 4.33 గంటలకు (భారత కాలమానం ప్రకారం..) అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయాణం మొదలుపెట్టింది. క్రూ-10 మిషన్‌లో భాగంగా స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ దీన్ని నింగిలోకి మోసుకెళ్లింది. ఇందులో అమెరికాకు చెందిన ఆన్ మెక్‌క్లెయిన్, నికోల్ అయర్స్, జపాన్ వ్యోమగామి టకుయా ఒనిషి, రష్యాకు చెందిన కిరిల్ పెస్కోవ్‌లు ఐఎస్ఎస్‌కు చేరుకొన్నారు. వీరికి సునీత, విల్మోర్ స్వాగతం పలికారు.

2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో వారు ఐఎస్ఎస్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ప్రణాళిక ప్రకారం వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు వారం రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమిని చేరుకుంది. దీంతో వారు ఐఎస్ఎస్‌లోనే చిక్కుకుపోయారు. తాజాగా క్రూ-10లోనే వీరు తిరిగి రానున్నారు.

# మస్క్ కుమారుడిని హెలికాప్టర్ ఎక్కించిన ట్రంప్



వాషింగ్టన్: టెస్లా అధినేత ఎలాన్ మస్క్ నాలుగేళ్ల కుమారుడు లిటిల్ ఎక్స్ మరోసారి అందరి దృష్టిని ఆకర్షించాడు. అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం గార్డెన్‌లో ఈ చిన్నారితో కలిసి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నడుస్తున్న దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. వారాంతం నిమిత్తం ఫ్లోరిడాలోని తన నివాసానికి ట్రంప్ బయల్దేరారు. ఆయనతో పాటు మస్క్ కూడా వెళ్లారు. ఈ సందర్భంగా శ్వేతసౌధం సౌత్ లాన్‌లో ఉన్న మెరైన్ వన్ హెలికాప్టర్ ఎక్కేందుకు ట్రంప్ వెళ్తుండగా.. ఆయన వెనకే మస్క్ కుమారుడు వచ్చాడు. ఈ సందర్భంగా లిటిల్ ఎక్స్‌ను ట్రంప్ హెలికాప్టర్ ఎక్కించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

# హూతీలపై అమెరికా భీకర దాడులు

## .. 31 మంది మృతి



**యెమెన్‌లోని హూతీలపై అమెరికాలోని ట్రంప్ సర్కారు సైనిక చర్యను మొదలుపెట్టింది. యెమెన్ రాజధాని సనా, సదా, అల్ బైదా, రాడాలే లక్ష్యంగా దాడులు జరిగాయి. ఇప్పటి వరకు 31 మంది మృతి చెందగా.. 101 మంది గాయపడినట్లు హూతీ ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. మృతుల్లో మహిళలు, చిన్నారులే ఎక్కువగా ఉన్నట్లు వెల్లడించింది.**

అమెరికా నౌకలు, విమానాలపై హూతీలు దాడులు చేయడాన్ని సహించేది లేదని యూఎస్ 'సెంట్రల్ కమాండ్' పేర్కొంది. ఇక అగ్రరాజ్య దాడులను హూతీ పొలిటికల్ బ్యూరో యుద్ధ నేరంగా అభివర్ణించింది. యెమెన్ దళాలు ప్రతిస్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించింది.

### అమెరికాలో పెను తుపాను.. 33 మంది మృతి

తిరుగుబాటుదారులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భగ్గుమన్నారు. 'హూతీలు మీ సమయం ఆసన్నమైంది. మీ దాడులు వెంటనే ఆపేయాలి. ఊహించని పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని ఆయన ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ప్రపంచ జలమార్గాల్లో అమెరికా వాణిజ్య, యుద్ధ నౌకలు స్వేచ్ఛగా వెళ్లకుండా ఏ ఉగ్రశక్తీ ఆపలేదన్నారు. హూతీలకు మద్దతు ఇవ్వడాన్ని నిలిపివేయాలని ఇరాన్‌ను హెచ్చరించారు. వారి చర్యలకు ఇరానే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.


# బ్యాంకాక్‌లో వంతెన కూలి అయిదుగురి మృతి

## కూలిపోయిన వంతెన వద్ద సహాయక చర్యలు

బ్యాంకాక్: థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న పైవంతెన కూలి అయిదుగురు మృతి చెందారు. మరో 24 మంది గాయపడ్డారు. మృతుల్లో ఓ ఇంజినీర్, నలుగురు కార్మికులు ఉన్నారు. ఈ ఘటన నైరుతి బ్యాంకాక్‌లో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. బ్యాంకాక్ నుంచి దక్షిణ థాయ్‌లాండ్‌ను అనుసంధానించే ప్రధాన రహదారిలో భాగంగా 5 కిలోమీటర్ల మేర 2022 నుంచి ఈ వంతెనను నిర్మిస్తున్నారు.



# బార్సిలోనాలో డ్రైవర్ రహిత బస్సు పరుగులు



బార్సిలోనా: స్పెయిన్‌లోని బార్సిలోనా నగరంలో డ్రైవర్ రహిత మినీ బస్సు చక్కర్లు కొడుతోంది. ఫ్రాన్స్‌కు చెందిన కార్ల తయారీ సంస్థ రెనో రూపొందించిన ఈ వాహనాన్ని ప్రయోగాత్మకంగా తిప్పుతున్నారు. రోజూ 2.2 కి.మీ. మేర ప్రయాణిస్తున్న ఈ బస్సు.. నాలుగు స్టాపుల్లో ఆగుతోంది. ప్రయోగాత్మక సర్వీసు అయినందున ఎక్కినవారి నుంచి టికెట్ డబ్బులు వసూలు చేయడం లేదని సంస్థ ప్రతినిధులు తెలిపారు. "మేం రూపొందించిన ఈ బస్సు ఒక్కసారి ఛార్జ్ చేస్తే 120 కి.మీ. ప్రయాణిస్తుంది. గంటకు 40 కి.మీ. వేగాన్ని అందుకుంటుంది. 10 కెమెరాలు 8 లైడార్ సెన్సర్‌లు దీనికి అమర్చాం. వాటి సాయంతో రోడ్డుపై వెళ్తున్న వాహనాలు, పాదచారులను గమనించి ఈ బస్సు ముందుకు వెళ్తుంది" అని రెనో ప్రతినిధి పాట్రిక్ వెర్జెలాస్ తెలిపారు.

# పాక్‌లో మిలిటరీ కాన్వాయ్‌పై బలోచ్ మిలిటెంట్ల దాడి.. ఐదుగురు మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో సైనికులు ప్రయాణిస్తున్న మిలిటరీ కాన్వాయ్‌పై బాంబు దాడి జరిగింది. ఆదివారం బలూచిస్థాన్‌లోని నోష్కిలో ఈ పేలుడు చోటు చేసుకొంది. ఈ దాడిలో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోగా.. మరో 12 మందికి తీవ్ర గాయాలైనట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. అధికారులు జరిపిన ప్రాథమిక దర్యాప్తులో దీనిని ఆత్మాహుతి దాడిగా గుర్తించారు. ఈ విషయాన్ని నోష్కి స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెల్లడించారు. మరోవైపు, ఈ పేలుడులో 90 మంది సైనికులను చంపినట్లు బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఓ ప్రముఖ మీడియాకు మెయిల్ పంపింది. "బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)కు చెందిన ఫిదాయీ యూనిట్ 'మజీద్ బ్రిగేడ్' కొన్ని గంటల క్రితం నోష్కి సమీపంలోని పాక్ మిలిటరీ కాన్వాయ్‌ని లక్ష్యంగా చేసుకుంది. దానిలో ఎనిమిది బస్సులు ఉన్నాయి. పేలుడు వల్ల ఒక వాహనం పూర్తిగా ధ్వంసమైంది. పేలుడు సంభవించిన తర్వాత బీఎల్ఏకు చెందిన ఫతే స్క్వాడ్ వెంటనే మరో బస్సును చుట్టుముట్టింది. దానిలో ఉన్న సైనికులను హతమార్చింది. మా విరోధుల మరణాల సంఖ్య 90కి చేరింది" అని పేర్కొంది. కాగా.. ఇటీవల పాక్‌లోని బలోచిస్థాన్‌లో ప్రయాణికుల రైలును వేర్పాటువాద ఈ మిలిటెంట్లు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. మొత్తం 400 మంది ప్రయాణిస్తున్న ఈ రైలుపై దాడికి తెగబడ్డారు. ప్రయాణికులను బందీలుగా మార్చి పలువురి ప్రాణాలు తీశారు. ఈ ఘటన జరిగిన అతి కొద్ది కాలంలో మరో దాడికి పాల్పడ్డారు. ఈ పేలుడులో ఐదుగురు సైనికులు మృతి చెందినట్లు లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి తెలిపారు.



## ఏపీ లోబయోడైవర్సిటీ పార్కుల ఏర్పాటుకు

# ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్




అమరావతి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రకృతి పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, పర్యావరణాన్ని కాపాడే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించడమే కాకుండా, స్థానిక వృక్ష జాతులను రక్షించేందుకు, పక్షుల ఆవాసాలను ప్రోత్సహించేందుకు బయోడైవర్సిటీ పార్కులను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ముఖ్యంగా తిరుపతి, విశాఖపట్నం, అమరావతి నగరాల్లో జీవ వైవిధ్యాన్ని అభివృద్ధి చేసేలా ఈ పార్కులను ఏర్పాటు చేయనుంది.పట్టణాల్లో పచ్చదనాన్ని పెంచడం. స్థానిక వృక్షజాతులను పునరుద్ధరించడం. పక్షుల, ఇతర జీవుల నివాసాలను పరిరక్షించడం. పర్యావరణంపై ప్రజల్లో అవగాహన పెంచడం.

**స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు**

తిరుపతిలో జరిగిన ఓ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు (ఏపీఎస్‌బీబీ) ఛైర్మన్ నీలాయపాలెం



విజయ్‌కుమార్ ఇటీవల పాల్గొన్నారు. ఈ సందర్భంగానే ఏపీలోని పట్టణ ప్రాంతాల్లో బయోడైవర్సిటీ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బయోడైవర్సిటీ పార్కుల ఏర్పాటు ద్వారా పట్టణాలలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాలలో జనసాంద్రత ఎక్కువ. ఈ నేపథ్యంలో పట్టణాలలో జీవ వైవిధ్యాన్ని కాపడటానికి ఈ బయోడైవర్సిటీ పార్కుల ఆలోచన చేస్తున్నారు.అలాగే తలకోన, కపిలతీర్థం ప్రాంతాలను బయోడైవర్సిటీ హెరిటేజ్ సైట్లుగా ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**తిరుపతిలో జీవవైవిధ్య ఉద్యానవనం**

తిరుమల కొండలలో ఒకప్పుడు వేప, సుబాబుల్ చెట్లు భారీ సంఖ్యలో ఉండేవన్న ఏపీఎస్‌బీబీ ఛైర్మన్, ప్రస్తుతం వాటి సంఖ్య తగ్గిపోయిందన్నారు. ఈ నష్టాన్ని భర్తీ చేయడానికి తిరుపతిలో బయోడైవర్సిటీ పార్కు ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణాలలో నిర్మాణాలు, అభివృద్ధి కారణంగా జీవ వైవిధ్యం దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక అధికారులు, పర్యావరణానికై పనిచేసే స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్య, పరిరక్షణ, సాంస్కృతిక కార్యకలాపాల కేంద్రంగా బయోడైవర్సిటీ పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలోని ప్రతి ఉమ్మడి జిల్లాలో బయోడైవర్సిటీ పార్కులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

**విశాఖపట్నం, అమరావతి బయోడైవర్సిటీ పార్కులు**

విశాఖపట్నంలో పారిశ్రామిక వృద్ధితో పాటు పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంగా బయోడైవర్సిటీ ఉద్యానవనం ఏర్పాటు చేయనున్నారు. ఇదే విధంగా, అమరావతిలో అభివృద్ధి పనులతో కూడిన జీవవైవిధ్య పరిరక్షణ ప్రణాళిక అమలులోకి రానుంది.

**పర్యావరణ పరిరక్షణపై అవగాహన**

బయోడైవర్సిటీ పార్కులు, బయోడైవర్సిటీ హెరిటేజ్ సైట్ల ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలని ప్రభుత్వం ఆలోచన. వీటి ద్వారా పచ్చదనం పెరగటంతో పాటుగా పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగానే తిరుపతి, విశాఖ, అమరావతిపై బయోడైవర్సిటీ పార్కుల అభివృద్ధిపై ఆలోచనలు చేస్తోంది.

## రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం బ్రేక్

అమరావతి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులను నిరాకరించింది. ఈ నిర్ణయం తెలంగాణ ప్రభుత్వానికి విజయంగా మారిందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కృష్ణా నదీ జలాలను వినియోగించి ఎత్తిపోతల పథకాన్ని అమలు చేయాలని ఏపీ భావించినప్పటికీ, అంతర్ రాష్ట్ర జల వివాదాలను ఉల్లంఘించకుండా నడపాల్సిన నిబంధనలు ఉన్నాయని కేంద్రం స్పష్టం చేసింది.

**తెలంగాణ అభ్యంతరాలు, ఫిర్యాదులు**

తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఏపీ అనుమతులు పొందకుండా రాయలసీమ ఎత్తిపోతల నిర్మాణాన్ని చేపట్టిందని, ఇది జల న్యాయాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. తెలంగాణ నీటి పారుదల



ముఖ్య కార్యదర్శి రాహల్ బొజ్జా కేంద్రానికి లేఖ రాసి, ఈ విషయాన్ని అధికారికంగా ప్రస్తావించారు. కేఆర్‌ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) మరియు అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండానే ప్రాజెక్టును నిర్మించేందుకు ఏపీ యత్నించిందని మంత్రి తెలిపారు.

**ఎన్జీటీ సమీక్ష, తుది నిర్ణయం**

ఫిబ్రవరి 27న జరిగిన 25వ సమావేశంలో నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ) ఈ ప్రాజెక్టును సమీక్షించింది. పర్యావరణ చట్టాలకు విరుద్ధంగా ప్రాజెక్టును ప్రారంభించారని ఎన్జీటీ తేల్చిచెప్పింది. దీంతో కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులను నిరాకరించడంతో, ఈ ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరింత ఒత్తిడిని ఎదుర్కొంటోంది.

**తెలంగాణ హక్కుల పరిరక్షణ**

తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా జలాల్లో సముచిత వాటా ఉండాలని, అవి కోల్పోకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, తెలంగాణ హక్కులను కాపాడేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రిని కలిసి, ప్రాజెక్టుపై సమగ్ర వివరణ ఇచ్చినట్లు తెలిపారు. కృష్ణా జలాలపై తెలంగాణ తన వాటాను నిలబెట్టుకునేందుకు చట్టపరంగా పోరాటం చేస్తామని వెల్లడించారు.

## వెంకటపాలెంలో అట్టహాసంగా శ్రీనివాస కల్యాణం



అమరావతి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీ రాజధాని అమరావతికి సమీపంలోని వెంకటపాలెంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల ఉత్సాహంతో ఆలయ ప్రాంగణం భక్తిరసంతో నిండిపోయింది. వేడుకల్లో రాష్ట్ర ప్రముఖులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ముఖ్య అతిథుల హాజరు**

ఈ పవిత్ర కల్యాణోత్సవానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, పలువురు ఎమ్మెల్యేలు, టీటీడీ పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. సీఎం చంద్రబాబు తన భార్య నారా



భువనేశ్వరి తో కలిసి స్వామివారి కల్యాణానికి హాజరై, భక్తి పరవశం వ్యక్తం చేశారు.

**పట్టు వస్త్ర సమర్పణ, తీర్థ ప్రసాదం**

రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వేద మంత్రాలతో మారుమ్రోగిపోయింది.

**వేలాది భక్తుల సమాగమం**

శ్రీనివాస కల్యాణాన్ని తిలకించేందుకు రాజధాని పరిసర గ్రామాల నుంచి 30,000 మందికి పైగా భక్తులు తరలివచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలో భక్తులకు లడ్డూ ప్రసాదం అందించబడింది. ఘనంగా జరిగిన ఈ వేడుక భక్తులందరికీ ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించింది.



## టెన్త్ విద్యార్థులకు ఏపీ సర్కార్ గుడ్‌న్యూస్

అమరావతి మార్చి 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్షలు మార్చి 17న ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల ప్రయాణాన్ని సులభతరం చేయడానికి ఏపీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షలకు హాజరయ్యే టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు.

**పరీక్షల కోసం ప్రత్యేక ఏర్పాట్లు**

ఈసారి ఇంగ్లీష్ మీడియం, ఎన్సీఈఆర్టీ సిలబస్‌తో పరీక్షలు జరగనున్నాయి. మార్చి 17న ప్రారంభమై ఏప్రిల్ 1 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, టెంటింగ్, ప్రథమ చికిత్స కేంద్రాలు, భద్రత కోసం ప్రత్యేక సిబ్బంది వ్యవస్థ కూడా ఏర్పాటు చేశారు. ఇక, ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యార్థులు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. హాల్‌టికెట్‌ను చూపించడం ద్వారా విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ బస్సులో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించారు.

**విద్యార్థులకు ప్రయోజనం**

ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం పరీక్షలు ఉన్న రోజుల్లో మాత్రమే వర్తిస్తుంది. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు ఉంటాయి, విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకునేలా బస్సుల సమయాలను సవరించారు. 649,884 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనుండగా, 3450 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సౌకర్యం పల్లెల నుంచి పట్టణాలకు, పట్టణాల నుంచి పరీక్షా కేంద్రాలకు వెళ్తున్న విద్యార్థులకు వర్తిస్తుంది. పరీక్షలు సెలవు రోజుల్లో నిర్వహించినా ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుంది. విద్యార్థులు బస్సులో ఎక్కే ముందు తమ హాల్‌టికెట్‌ను డ్రైవర్ లేదా కండక్టర్‌కు చూపించాలి. బస్సుల్లో ఎక్కడా అదనపు ఛార్జీలు వసూలు చేయరాదని ఆర్టీసీ సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే ఈ సౌకర్యం లభిస్తుంది. పరీక్ష కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది పడకుండా పోలీసులు, అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీటీవీలు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. ఏపీలో పదో తరగతి విద్యార్థుల కోసం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ప్రభుత్వ పెద్ద నిర్ణయం. ఇది లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగించనుంది. పరీక్షలు సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు హాల్‌టికెట్‌ను తీసుకెళ్లి ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకోవాలి.

# దాని గురించి చర్చించాల్సిన అవసరం లేదు..

## బ్రాడ్‌కాస్టర్స్‌కు కోహ్లీ చురక

**టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ మంచి ఆహార ప్రియుడనే విషయం తెలిసిందే. తన ఆహారపు అలవాట్లతోనే ఫిట్‌గా ఉన్నానని అతను గతంలో చెప్పాడు. కోహ్లీకి ఢిల్లీ వంటకాలంటే ఎంతో ఇష్టం. ఇక 'చోలే బటూరే' అంటే మనసు పారేసుకుంటాడు. కొన్ని సందర్భాల్లో మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు కూడా కోహ్లీ తనకిష్టమైన 'చోలే బటూరే'ని తింటుంటాడు. దీన్ని బ్రాడ్‌కాస్టర్స్ టీవీల్లో చూపిస్తూ హైలైట్ చేసిన సందర్భాలున్నాయి. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న విరాట్ ప్రసారకర్తల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. కోహ్లీ ఏం తింటున్నాడు? అతని ఫేవరెట్ వంటకం ఢిల్లీలో ఎక్కడ దొరుకుతుంది? అనే విషయాలపై చర్చ అవసరం లేదన్నాడు.**

'భారత్ క్రీడా దేశంగా ఎదిగేందుకు మేం కృషి చేస్తున్నాం. మనకు విజన్ ఉంది. అందుకోసం ప్రస్తుతం గ్రౌండ్‌వర్క్ జరుగుతోంది. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరికి బాధ్యత ఉండాలి. ఇది కేవలం మౌలిక సదుపాయాలు లేదా పెట్టుబడి పెట్టే వ్యక్తుల గురించి కాదు. ఆటను చూసే ప్రేక్షకులపై కూడా బాధ్యత ఉంటుంది. దీనిపై మనందరికి అవగాహన రావాల్సిన అవసరముంది. బ్రాడ్‌కాస్ట్ షోలో ఆట గురించి మాట్లాడాలి. అంతే తప్ప నేను నిన్న మధ్యాహ్నం లంచ్‌లో ఏం తీసుకొన్నా? లేదా ఢిల్లీలో నాకు ఇష్టమైన 'చోలే బటూరే' ఎక్కడ లభిస్తుంది అనే విషయాలపై చర్చించాల్సిన అవసరం లేదు. దానికి బదులుగా ఒక అథ్లెట్‌గా ఏం చేస్తున్నా అనే దానిపై చర్చించవచ్చు' అని కోహ్లీ వివరించాడు.



### ఏ ఆటగాడు ఒంటరిగా కూర్చొని బాధపడటానికి ఇష్టపడడు

ఆస్ట్రేలియా పర్యటనలో టీమ్‌ఇండియా వైఫల్యం నేపథ్యంలో భారత క్రికెట్లో ప్రక్షాళన కోసం 10 పాయింట్లతో కూడిన నియమావళిని సెంట్రల్ కాంట్రాక్టు ఆటగాళ్లకు బీసీసీఐ పంపించింది. విదేశీ పర్యటనల సమయంలో క్రికెటర్ల వెంట కుటుంబ సభ్యుల బసపైనా పరిమితులు విధించింది. సుదీర్ఘ పర్యటనలో భాగస్వామి, పిల్లలు రెండు వారాలు మాత్రమే ఉండొచ్చు. తక్కువ వ్యవధి సిరీస్‌లో కేవలం వారం రోజులు మాత్రమే అనుమతి ఉంటుంది. ఈ అంశంపై కోహ్లీ తాజాగా స్పందించాడు. 'మనం ఏదైనా తీవ్ర సమస్యతో ఇబ్బంది పడుతున్నప్పుడు కుటుంబసభ్యుల మద్దతు తప్పనిసరి. టూర్‌లో పేలవ ప్రదర్శన తర్వాత ఏ ఆటగాడు ఒంటరిగా కూర్చోవడానికి ఇష్టపడడు. ఆట అనేది బాధ్యత. దాన్ని పూర్తి చేసిన తర్వాత తిరిగి వ్యక్తిగత జీవితం గురించి ఆలోచిస్తాం. నాకు వీలైనప్పుడల్లా బయటకు వెళ్లి నా కుటుంబంతో గడిపే అవకాశాలను వదులుకోను' అని విరాట్ పేర్కొన్నాడు.

టీమ్‌ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ విజయంలో కీలకపాత్ర పోషించిన కోహ్లీ చిన్న విరామం తీసుకుని ఐపీఎల్-2025 సీజన్ కోసం సన్నద్ధమవుతున్నాడు. ఆదివారం కోహ్లీ ఆర్సీబీ క్యాంప్‌లో చేరాడు. మార్చి 22న జరిగే టోర్నీఆరంభ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా, ఆర్సీబీ తలపడనున్నాయి.

# మరికొన్ని రోజుల్లో ఐపీఎల్.. భారీ రికార్డుకు ఒక్క సెంచరీ దూరంలో కోహ్లీ




**అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్-2025 సీజన్ మరో 6 రోజుల్లో ప్రారంభంకానుంది. ఇప్పటికే ఆటగాళ్లంతా ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యారు. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కూడా ఆర్సీబీ క్యాంప్‌లో చేరాడు. ఈ సీజన్‌లో కోహ్లీ ఓ భారీ రికార్డును అందుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. అతను ఈ ఐపీఎల్ సీజన్‌లో ఒక్క సెంచరీ చేస్తే టీ20 క్రికెట్‌లో 10 శతకాలు పూర్తి చేసుకుంటాడు. ఈ క్రమంలోనే పొట్టి ఫార్మాట్‌లో ఇన్ని సెంచరీలు చేసిన తొలి భారత బ్యాటర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఈ జాబితాలో కోహ్లీ అగ్రస్థానంలో ఉండగా.. రోహిత్ శర్మ (8) రెండో స్థానంలో ఉన్నాడు. కోహ్లీ ఇప్పటి వరకు 399 మ్యాచ్‌లు ఆడి 9 సెంచరీలు బాదాడు. ఇందులో ఎనిమిది ఐపీఎల్‌లో కాగా.. ఒకటి అంతర్జాతీయ క్రికెట్‌లో. ఐపీఎల్‌లో అధిక శతకాలు చేసింది కోహ్లీనే. 2016 ఐపీఎల్‌లో విరాట్ ఏకంగా నాలుగు సెంచరీలు బాదేశాడు.**

టీ20ల్లో ఎక్కువ సెంచరీలు చేసిన ఆటగాళ్లు
క్రిస్ గేల్ (వెస్టిండీస్, 463 మ్యాచ్‌లు)-22
బాబర్ అజామ్ (పాకిస్థాన్, 309 మ్యాచ్‌లు)-11
విరాట్ కోహ్లీ (భారత్, 399 మ్యాచ్‌లు)-9
మైకేల్ క్లింగర్ (ఆస్ట్రేలియా, 206 మ్యాచ్‌లు )-9
రిలీ రోసోవ్ (సౌతాఫ్రికా, 367 మ్యాచ్‌లు)-8
ఆరోన్ ఫించ్ (ఆస్ట్రేలియా, 387 మ్యాచ్‌లు )-8
డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా, 399 మ్యాచ్‌లు)-8
జోస్ బట్లర్ (ఇంగ్లాండ్, 434 మ్యాచ్‌లు)-8
రోహిత్ శర్మ (భారత్, 448 మ్యాచ్‌లు)-8

# ఇది కదా ఐపీఎల్ క్రేజ్..

## మ్యాచ్ టిక్కెట్ ఉంటే మెట్రో రైలు, ఎంటీసీ బస్సులలో ప్రయాణం ఉచితం

**ఐపీఎల్ అనేది కేవలం క్రికెట్ టోర్నమెంట్ మాత్రమే కాకుండా.. కోట్లాది మంది అభిమానులకు ఉత్సాహాన్ని, వినోదాన్ని పంచే గొప్ప పండుగ అని చెప్పవచ్చు. ఈ సారి జరగబోయే ఐపీఎల్ 2025 సీజన్ ను మరింత సులభతరం చేసేందుకు చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కలిసి కొత్త సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చాయి. ముఖ్యంగా, చెన్నై సూపర్ కింగ్స్ హోమ్ మ్యాచ్‌లకు హాజరయ్యే అభిమానుల కోసం ఈ ఉచిత మెట్రో రైలు, బస్సు సేవలను అందిస్తున్నారు. ఐపీఎల్ 2025లో భాగంగా చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగే మ్యాచ్‌లకు టిక్కెట్ కలిగిన వారు మెట్రో రైలు సేవలను ఉచితంగా వినియోగించుకోవచ్చు. చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం, క్రికెట్ టిక్కెట్ కలిగిన ప్రేక్షకులు తమ సమీప మెట్రో స్టేషన్ నుండి గవర్నమెంట్ ఎస్టేట్ మెట్రో స్టేషన్ వరకు ప్రయాణించడానికి ఎలాంటి ఛార్జీలు చెల్లించనవసరం లేదు.**



ఈ సేవలు మ్యాచ్ జరిగే రోజుల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయి. మ్యాచ్ ముగిసిన తర్వాత 90 నిమిషాల పాటు లేదా అర్ధరాత్రి 1 గంట వరకు మెట్రో రైళ్లను అందుబాటులో ఉంచనున్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి, అవసరమైనప్పుడు మెట్రో రైలు చివరి సర్వీస్ సమయాన్ని పొడిగించే అవకాశం కూడా ఉంది. కేవలం మెట్రో రైలు మాత్రమే కాకుండా, చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కూడా ఐపీఎల్ అభిమానుల కోసం ప్రత్యేక బస్సు సేవలను అందుబాటులోకి తెచ్చింది. చెన్నై సూపర్ కింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ ప్రకటన ప్రకారం, %జూఖ% హోమ్ మ్యాచ్‌కు హాజరయ్యే అభిమానులు తమ క్రికెట్ మ్యాచ్ టిక్కెట్‌ను చూపించి ఎంటీసీ నాన్-ఏసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ ఉచిత బస్సు సేవలు మ్యాచ్ ప్రారంభానికి మూడు గంటల ముందు నుంచే అందుబాటులో ఉంటాయి. గత ఏడాది చెన్నైలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లకు దాదాపు 8,000 మంది వరకు ఎంటీసీ బస్సుల సేవలను ఉపయోగించుకున్నారని విశ్వనాథన్ తెలిపారు. ఈ విషయమై CSK టీం మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. మా అభిమానులకు ఉత్తమ అనుభవాన్ని అందించాలనే లక్ష్యంతో మెట్రో, MTCతో ఈ భాగస్వామ్యం కుదుర్చుకున్నామని తెలిపారు. చెన్నైలోని క్రికెట్ అభిమానులు తమ ఇళ్ల నుంచి బయలుదేరిన క్షణం నుండే ఐపీఎల్ ఉత్సాహాన్ని పూర్తిగా ఆస్వాదించగలిగేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రణాళిక వెనుక ప్రధాన లక్ష్యం అభిమానులను మెట్రో, బస్సుల వంటి ప్రజా రవాణా సేవలను ఉపయోగించేందుకు ప్రోత్సహించడం. ప్రజా రవాణా వాడకాన్ని పెంచడం ద్వారా ట్రాఫిక్ సమస్యను తగ్గించడంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది. ఈ దెబ్బతో ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు మెట్రో, బస్సు సేవలు ఉచితంగా అందించడంతో వారు మరింత సులభంగా స్టేడియంకు చేరుకునే అవకాశం చేకూరనుంది.

# బ్యాట్స్‌మెన్స్ దూకుడికి కళ్లెం వేసి ఐపీఎల్ చరిత్రలో 'పర్పుల్ క్యాప్' సాధించిన ఘనులు వీరే

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ప్రతీ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌కు పర్పుల్ క్యాప్ ను అందజేస్తారన్న విషయం తెలిసిందే. ఐపీఎల్ అంటేనే బ్యాట్స్మెన్ హవా కొనసాగుతుంది. బంతి బంతికి పరుగు తీసేందుకు ప్రయత్నించే ఈ టి20 ఫార్మేట్ లో బ్యాట్స్మెన్ దూకుడుకి కళ్లెం వేసి వికెట్లను సాధించడం అంత ఆషామాసి విషయం కాదు. కాబట్టి, ప్రతి సీజన్ లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ కు ఐపీఎల్ పర్పుల్ క్యాప్ అందజేస్తుంది. మరి ఇది వరకు జరిగిన 17 ఐపీఎల్ సీజన్లలో ఎవరెవరు ఎన్నిసార్లు పర్పుల్ క్యాప్ అందుకున్నారో చూద్దామా..




### ఐపీఎల్ చరిత్రలో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న ఆటగాళ్లు వీరే

- 2024: హర్షల్ పటేల్ (పంజాబ్) - 24 వికెట్లు (14 మ్యాచ్‌లు),
- 2023: మొహమ్మద్ షమీ (గుజరాత్ టైటాన్స్) - 28 వికెట్లు (17 మ్యాచ్‌లు),
- 2022: యుజ్వేంద్ర చాహల్ (రాజస్థాన్ రాయల్స్) - 27 వికెట్లు (17 మ్యాచ్‌లు),
- 2021: హర్షల్ పటేల్ (బెంగళూరు) - 32 వికెట్లు (15 మ్యాచ్‌లు),
- 2020: కగిసో రబాడా (పంజాబ్) - 30 వికెట్లు (17 మ్యాచ్‌లు),
- 2019: ఇమ్రాన్ తాహిర్ (చెన్నై సూపర్ కింగ్స్) - 26 వికెట్లు (17 మ్యాచ్‌లు),
- 2018: ఆండ్రూ టై (రాజస్థాన్ రాయల్స్) - 24 వికెట్లు (14 మ్యాచ్‌లు),
- 2017: భువనేశ్వర్ కుమార్ (సన్‌రైజర్స్ హైదరాబాద్) - 26 వికెట్లు (14 మ్యాచ్‌లు),
- 2016: భువనేశ్వర్ కుమార్ (సన్‌రైజర్స్ హైదరాబాద్) - 23 వికెట్లు (17 మ్యాచ్‌లు),
- 2015: డ్వేన్ బ్రావో (చెన్నై సూపర్ కింగ్స్) - 26 వికెట్లు (17 మ్యాచ్‌లు),
- 2014: మోహిత్ శర్మ (చెన్నై సూపర్ కింగ్స్) - 23 వికెట్లు (16 మ్యాచ్‌లు),
- 2013: డ్వేన్ బ్రావో (చెన్నై సూపర్ కింగ్స్) - 32 వికెట్లు (18 మ్యాచ్‌లు),
- 2012: మోర్నే మోర్కెల్ (ఢిల్లీ డేర్‌డెవిల్స్) - 25 వికెట్లు (16 మ్యాచ్‌లు),
- 2011: లసిత్ మలింగ (ముంబై ఇండియన్స్) - 28 వికెట్లు (16 మ్యాచ్‌లు),
- 2010: ప్రగ్యాన్ ఓజా (డెక్కన్ ఛార్జర్స్) - 21 వికెట్లు (16 మ్యాచ్‌లు),
- 2009: ఆర్పీ సింగ్ (డెక్కన్ ఛార్జర్స్) - 23 వికెట్లు (16 మ్యాచ్‌లు),
- 2008: సోహైల్ తన్వీర్ (రాజస్థాన్ రాయల్స్) - 22 వికెట్లు (11 మ్యాచ్‌లు).

మొత్తానికి ఐపీఎల్‌లో పర్పుల్ క్యాప్ గెలుచుకోవడం ఒక బౌలర్‌కు అతని అత్యుత్తమ ప్రతిభకు గుర్తింపుగా నిలుస్తుంది. 2013లో డ్వేన్ బ్రావో, 2021 సీజన్లలో హర్షల్ పటేల్ ఒక సీజన్ లో 32 వికెట్లతో అత్యధిక వికెట్ల తీసి రికార్డు సాధించారు. ఇక ఐపీఎల్ చరిత్రలో డ్వేన్ బ్రావో, భువనేశ్వర్ కుమార్, హర్షల్ పటేల్ లు చెరో రెండేసి సార్లు పర్పుల్ క్యాప్ సంపాదించారు. మరి ఐపీఎల్ 2025 సీజన్‌లో అత్యుత్తమ బౌలర్‌గా ఎవరు అవుతారని భావిస్తున్నారు? మీ అభిప్రాయాన్ని కామెంట్ రూపంలో తెలపండి.

# తీరుమారని పాకిస్తాన్.. మరోమారు ఘోర పరాజయం

న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన పాకిస్తాన్ జట్టుకు ఊహించని ఆరంభం ఎదురైంది. క్రైస్ట్‌చర్చ్ లోని హెగ్లీ ఓవల్ మైదానంలో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు పూర్తిగా విఫలమైంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోనూ జట్టు తీవ్రంగా నిరాశపరిచింది. దీనితో పాకిస్తాన్ జట్టు ఓటమిని తప్పించుకోలేకపోయింది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు అద్భుత ప్రదర్శనతో సిరీస్‌ను విజయంతో ఆరంభించింది. న్యూజిలాండ్ టాస్ గెలిచి పాకిస్తాన్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. మ్యాచ్ ప్రారంభమైనప్పటి నుంచి న్యూజిలాండ్ బౌలర్లు రెచ్చిపోయారు. పాకిస్తాన్ ఓపెనర్లు పూర్తిగా విఫలమయ్యారు. ఓపెనర్లు ఒక్క పరుగు కూడా చేయలేకపోయారు. ఆ సమయంలో కేవలం ఒక్క పరుగుకే 3 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఆటగాళ్లు వరుసగా పెవిలియన్ బాట పట్టారు. దీనితో పాకిస్తాన్ జట్టు కేవలం 18.4 ఓవర్లలో 91 పరుగులకే ఆలౌటైంది. ఈ ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్ తరఫున ఖుష్దిల్ షా 32 పరుగులు చేయగా, జహానదాద్ ఖాన్ 17 పరుగులతో పాకిస్థాన్ కాస్త గౌరవప్రదమైన స్కోరును అందుకుంది. ఇక





న్యూజిలాండ్ బౌలింగ్ విభాగంలో జాకబ్ డఫీ అద్భుత ప్రదర్శన చేశాడు. అతను 4 వికెట్లు తీసి పాకిస్తాన్ బ్యాటింగ్‌ను పూర్తిగా దెబ్బతీశాడు. మరోవైపు కైల్ జామిసన్ కూడా, 4 ఓవర్లలో కేవలం 8 పరుగులిచ్చి 3 వికెట్లు తీసుకున్నాడు. ఇక ఈష్ సోధి 2 వికెట్లు, జాకరీ ఫౌల్కెస్ 1 వికెట్ సాధించారు. ఇక స్వల్ప లక్ష్యంతో ఇన్నింగ్స్ ని మొదలు పెట్టిన న్యూజిలాండ్ మ్యాచ్ ముగించడానికి పెద్దగా సమయం తీసుకోలేదు. కేవలం 10.1 ఓవర్లలో అంటే 61 బంతుల్లోనే విజయం సాధించారు. ఇక న్యూజిలాండ్ ఇన్నింగ్స్ టిమ్ సీఫర్ట్ 29 బంతుల్లో 44 పరుగులు చేసి అవుట్ అవ్వగా.. ఆ తర్వాత వచ్చిన ఫిన్ అలెన్ 17 బంతుల్లో 29 పరుగులు నాటౌట్, టిమ్ రాబిన్సన్ 15 బంతుల్లో 18 పరుగులతో అజేయంగా నిలిచారు. పాకిస్తాన్ బౌలింగ్ విభాగంలో ఒకే ఒక్క వికెట్ ను అబ్రార్ అహ్మద్ సాధించాడు. మిగతా బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు.

# అందాల సీతాకోక చిలుక




బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ హీరోయిన్‌గా ఎంత బిజీగా ఉన్నా, ఫ్యామిలీతో ఎంత ఎక్కువ సమయం కేటాయిస్తున్నా సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేయడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ మ్యాగజైన్‌లపై కవర్ ఫేజీల కోసం ఫోటో షఉట్స్ ఇస్తూనే ఉంటుంది. తాజాగా బజార్ ఇండియా కోసం ఆలియా భట్ సీతాకొక చిలుక రూపంలో కనిపించింది. అందమైన సీతాకొక చిలుక మాదిరిగా ఫోటోలకు ఫోజ్ ఇవ్వడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బజార్ ఇండియా సోషల్ మీడియా పేజీలో ఈ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వైరల్ అయ్యాయి. ఆలియాను ఆమె అభిమానులతో పాటు ఎక్కువ శాతం మంది బ్రెయిన్ విత్ బ్యూటీ అంటూ ప్రశంసలు కురిపిస్తూ ఉంటారు. అందుకే ఈ అమ్మడి ఫోటోలు సోషల్ మీడియాలో ఎప్పుడు వచ్చినా వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా మరోసారి ఈమె తన అందమైన ఫోటోలతో వైరల్ అవుతోంది. విభిన్నమైన లుక్, సింపుల్ హెయిర్ స్టైల్‌తో ఆలియా భట్ మతి పోగొట్టింది. ఆకట్టుకునే అందంతో పాటు, తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో స్టార్‌డం దక్కించుకున్న ప్రతిభ ఈమె సొంతం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందుకే ఈమె సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేసిన వెంటనే వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. బాలీవుడ్ సినిమాల్లోనే కాకుండా సౌత్ సినీ ప్రేక్షకులకు కూడా ఈమె సుపరిచితురాలు అనే విషయం తెల్సిందే. టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో హీరోయిన్‌గా ఈమె నటించింది. రామ్ చరణ్ కు జోడీగా నటించిన ఆ సినిమా బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే ఆ సినిమాలో ఆలియా పాత్ర ఇంకాస్త ఎక్కువ ఉంటే బాగుండేది అనేది కొందరి అభిప్రాయం. ఆ సినిమా తర్వాత టాలీవుడ్ నుంచి భారీ పారితోషికంతో పలు ఆఫర్లు వచ్చినా ఆలియా తిరస్కరించిందనే వార్తలు సోషల్ మీడియాతో పాటు, ఇండస్ట్రీ వర్గాల్లోనూ ప్రచారం జరిగాయి. ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్ సినిమాల్లోనూ నటిస్తున్న ఆలియా భట్ ఒక బిడ్డకు తల్లి అయిన ఏ మాత్రం అందం తగ్గకుండా అంతకు మించి అన్నట్లుగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందమైన ఆలియా భట్ ఫోటోలు ఎప్పటిలాగే సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఆలియా భట్ హాలీవుడ్‌లో బిజీ అవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

ప్రస్తుతం బాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్స్ జాబితాలో ఆలియా ముందు ఉంటుంది అనే విషయం తెల్సిందే. నటిగానే కాకుండా ఇలా కవర్ పేజీలపై తన అందంతో ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ సందడి చేస్తోంది.

# అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన రెహమాన్



అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన రెహమాన్ ప్రఖ్యాత సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరిన ఆయన, చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యారు. డీహైడ్రేషన్ కారణంగా ఆసుపత్రిలో చేరిన రెహమాన్ నిన్న లండన్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత రెహమాన్ అస్వస్థతకు గురయ్యారని ఆయన ప్రతినిధి తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం డీహైడ్రేషన్ కారణంగా అస్వస్థత కలిగిందని డాక్టర్లు నిర్ధారించారు. రంజాన్ మాసంలో ఉపవాసం పాటించడంతో శరీరంలో నీరు తగ్గినట్లు వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం రెహమాన్ ఆరోగ్యంగా ఉన్నారని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.


**"రెహమాన్ మాజీ భార్యను అని పిలవొద్దు" %-% సైరా బాను స్పందన**

ఇటీవల సోషల్ మీడియాలో సైరా బాను గురించి "రెహమాన్ మాజీ భార్య" అని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఆమె స్వయంగా స్పందిస్తూ, తాను ఇంకా రెహమాన్ భార్యగానే ఉన్నానని స్పష్టం చేశారు. మేము అధికారికంగా విడాకులు తీసుకోలేదు, భార్యాభర్తలుగానే కొనసాగుతున్నాం" అని పేర్కొన్నారు. నాకు గత రెండేళ్లుగా ఆరోగ్య సమస్యలు ఉండటంతో రెహమాన్‌కు ఒత్తిడి కలిగించకూడదని, కొంతకాలం దూరంగా ఉన్నాను" అని తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను, నా ప్రార్థనలు ఎప్పుడూ ఆయనతో ఉంటాయి అని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులు ఆయనను బాగా చూసుకోవాలి" అని విజ్ఞప్తి చేశారు.

**రెహమాన్, సైరా బాను విడాకుల ప్రకటన %-% గత ఏడాది వైరల్ అయిన వార్త**

గత సంవత్సరం రెహమాన్, సైరా బాను విడిపోతున్నట్లు వార్తల్లోకి వచ్చారు. 29 సంవత్సరాలుగా వివాహ బంధంలో ఉన్న ఈ జంట విడిపోతున్నారనే వార్త అభిమానులను షాక్‌కు గురిచేసింది. వీరి కుటుంబంలో ముగ్గురు పిల్లలు %-% కుమారుడు ఏఆర్ అమీన్, కుమార్తెలు ఖతీజా రెహమాన్, రహీమా రెహమాన్ ఉన్నారు. విరిగిన హృదయాల భారాన్ని మోయడం బాధాకరం" %-% రెహమాన్ ఎమోషనల్ పో స్ట్.విడాకుల వార్తలపై స్పందించిన రెహమాన్, తన భావోద్వేగాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.మేము 30 ఏళ్లు కలిసి ఉండాలని ఆశించాం, కానీ అన్నింటికీ ఒక ముగింపు ఉంటుందనిపిస్తోంది" అని తెలిపారు.విరిగిన హృదయాల బరువును దేవుని సింహాసనం కూడా తట్టుకోలేమని అనిపిస్తోంది" అని అన్నారు.ఈ విడిపోవుటలో అర్థం వెతుకుతున్నాము" అని పేర్కొన్నారు.ఈ క్లిష్ట సమయంలో మా వ్యక్తిగత గోప్యతను గౌరవించిన అందరికీ కృతజ్ఞతలు" అని తెలిపారు.

# మార్చి 27న విడుదల కానుంది : మోహన్ లాల్



మార్చి 27న విడుదల కానుంది : మోహన్ లాల్ మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ కలయికలో రూపొందుతున్న %ూ2జు%: ఎంపురాన్ ప్రపంచవ్యాప్తంగా మార్చి 27న విడుదల కానుంది. ఈ సినిమా 2019లో విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్ అయిన లూసిఫర్కు సీక్వెల్‌గా రాబోతోంది. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం, విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు.ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ %-% తొలి షో మార్నింగ్ 6 గంటలకు %ూ2జు%: ఎంపురాన్ మొదటి ఆట భారత కాలమానం ప్రకారం మార్చి 27 ఉదయం 6:00 గంటలకు ప్రారంభం కానుందని చిత్రబృందం ప్రకటించింది.ఇతర దేశాల్లో అక్కడి కాలమానం ప్రకారం షోలు ప్రారంభమవుతాయి. మేకర్స్ విడుదలకు భారీ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ చిత్రానికి మురళి గోపి కథ అందించగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు లైకా ప్రొడక్షన్స్, ఆశీర్వాద్ సినిమాస్, శ్రీ గోకులం మూవీస్ కలిసి భారీ బడ్జెట్‌తో నిర్మించాయి. సుబాస్కరన్, ఆంటోని పెరుంబావూర్, గోకులం గోపాలన్ నిర్మాతలుగా వ్యవహరించారు.

**మోహన్ లాల్ పవర్‌ఫుల్ క్యారెక్టర్**




మోహన్ లాల్ ఈ సినిమాలో ఖురేషి-అబ్రామ్ అలియాస్ స్టీఫెన్ నెడుంపల్లి పాత్రలో కనిపించనున్నారు.ఇది లూసిఫర్ కథను మరింత మిస్టీరియస్, ఇంటెన్స్ లెవల్‌కు తీసుకెళ్లేలా ఉంటుంది. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, టొవినో థామస్, మంజు వారియర్, ఇంద్రజిత్ సుకుమారన్, సూరజ్ వెంజరమూడు, సానియా అయ్యప్పన్, సాయికుమార్ వంటి టాలెంటెడ్ నటులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఈ సినిమా ప్రత్యేకతను చాటుకునేందుకు గేమ్ ఆఫ్ థ్రోన్స్ ఫేమ్ జెరోమ్ ఫ్లైన్ ఈ మూవీ ద్వారా భారతీయ చిత్రపరిశ్రమలో అడుగుపెడుతున్నారు.

**భారీ స్థాయిలో షూటింగ్ - అంతర్జాతీయ లొకేషన్లు**

ఎంపురాన్ చిత్రీకరణ 2023 అక్టోబర్ 5న ఫరీదాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సినిమా భారీ లొకేషన్లలో షఉటింగ్ జరుపుకుంది %-% సిమ్లా, లేహ్, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్, చెన్నై, గుజరాత్, హైదరాబాద్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ముంబై, కేరళ. సినిమా విజువల్ క్వాలిటీకి ప్రాధాన్యం ఇస్తూ 1:2.8 యాస్పెక్ట్ రేషియోలో చిత్రీకరించారు.

ఇంటెన్స్ ప్రమోషన్స్ %-% క్యారెక్టర్ పోస్టర్లతో స్పెషల్ హైప్

ఎంపురాన్ ప్రమోషన్లు జనవరి 26న కొచ్చిలో విడుదలైన టీజర్‌తో ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 9 నుంచి ఒక్కొక్క పాత్రకు సంబంధించిన పోస్టర్లు, 2-3 నిమిషాల వీడియోలు విడుదల చేస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచారు. ఫిబ్రవరి 26న మోహన్ లాల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ఈ ప్రచార కార్యక్రమం ఫినాలే కి చేరుకుంది. బహుభాషా విడుదల – దేశవ్యాప్తంగా భారీ అంచనాలు L2E: ఎంపురాన్ మలయాళం, తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది. లూసిఫర్ తనదైన స్టైల్‌లో ప్రేక్షకులను అలరించగా, ఈ సీక్వెల్ మరింత గ్రాండ్‌గా ఉండబోతుందని చిత్రయూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

# సడెన్‌గా ఓటీటీలోకి వచ్చేసిన థ్రిల్లర్ మూవీ



సడెన్‌గా ఓటీటీలోకి వచ్చేసిన థ్రిల్లర్ మూవీ ఎప్పటిలానే ఈ వారం కూడా పలు కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఓటీటీలో విడుదల అయ్యాయి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలకు చెందిన ఎన్నో సినిమాలు, వెబ్ సిరీస్‌లు అందుబాటులోకి వచ్చాయి. అయితే, ఒక తెలుగు హారర్ థ్రిల్లర్ సినిమా మాత్రం ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా ఓటీటీలో విడుదల అయింది. దివంగత నటుడు శరత్ బాబు తనయుడు ఆయుష్ తేజ్ ప్రధాన పాత్రలో నటించిన దక్ష అనే హారర్ థ్రిల్లర్ సినిమా ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. విక్రాంత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 2023 ఆగస్టు 25న థియేటర్లలో విడుదలైంది. తనికెళ్ల భరణి వంటి ప్రముఖ నటులు ఈ సినిమా ప్రమోషన్లలో పాల్గొన్నారు. కానీ, సినిమా కొత్త నటీనటులతో ఉండటంతో ప్రేక్షకులు పెద్దగా ఆసక్తి చూపలేదు. అయితే, కథ, కథనాల పరంగా మంచి ప్రశంసలు అందుకుంది. ఇప్పటివరకు ఎవరూ ఊహించని విధంగా, దక్ష సినిమా ఎలాంటి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ లేకుండా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది.

**యూట్యూబ్‌లో కూడా ఫ్రీగా అందుబాటులో ఉంది**

**దక్ష సినిమా కాస్టింగ్, టెక్నికల్ టీమ్ వివరాలు**

శ్రీ అన్నపూర్ణ క్రియేషన్స్ బ్యానర్‌పై తల్లాడ శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమాలో, ఆయుష్ తేజ్ తో పాటు అఖిల్, అను, నక్షత్ర, రియా, రవి రెడ్డి, శోభన్ బోగరాజు, పవన్ కీలక పాత్రలు పోషించారు. సంగీతం: లలిత్ కథ, మాటలు: శివ కాకు శివ రాథోడ్, ఆర్.ఎస్. శ్రీకాంత్ దక్ష సినిమా కథలో ఏముంది కొంత మంది యువతీ, యువకులు సరదాగా ఓ భయంకరమైన గేమ్ ఆడటం మొదలు పెడతారు. కానీ, ఆ గేమ్ ఆడిన వారంతా ఒక్కొక్కరుగా మ%ఎర్వతీఆశీబం%గా మృతి చెందుతుంటారు. అసలు ఆ గేమ్‌లో మిస్టరీ ఏమిటి ఈ గేమ్ ఆడినవాళ్లు ఎందుకు చనిపోతున్నారు వాళ్లను హత్య చేస్తున్నది ఎవరు ఆ హత్యలకు గేమ్‌కు మధ్య సంబంధం ఏమిటి హారర్ థ్రిల్లర్ లవర్స్‌కి పరఫెక్ట్ ఎంటర్టైన్మెంట్ హారర్ థ్రిల్లర్ సినిమాలు ఇష్టపడేవారికి దక్ష మంచి ఆప్షన్ అని చెప్పొచ్చు. రహస్యాలు, ఉత్కంఠ భరితమైన కథనం, థ్రిల్లింగ్ మూమెంట్స్ నచ్చే వారికి ఈ సినిమా మిస్ కాకుండా చూడమని సూచిస్తున్నారు.

# మదర్స్ మిల్క్ బ్యాంక్ : జయవాడలో పర్యటించిన నమ్రత



విజయవాడలో పర్యటించిన నమ్రత టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు భార్య నమ్రత శిరోద్కర్ నేడు విజయవాడ లో పర్యటించారు. ఆంధ్ర హాస్పిటల్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మదర్స్ మిల్క్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సేవా ప్రాజెక్టుకు రోటరీ ఇంటర్నేషనల్ నిధులు అందించింది.తల్లి పాలు అందక ఇబ్బంది పడే శిశువులకు ఉపయుక్తమైన మిల్క్ బ్యాంక్. ఈ సందర్భంగా నమ్రత శిరోద్కర్ మాట్లాడుతూ, అనేక శిశువులకు తల్లి పాలను అందించడం కష్టంగా మారుతుందని, ఇలాంటి పరిస్థితుల్లో మదర్స్ మిల్క్ బ్యాంక్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. తల్లి పాలను పొందలేని శిశువులకు ఈ బ్యాంక్ ద్వారా పౌష్టికాహారం అందించవచ్చని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా తల్లిపాలను దానం చేసే వారి సహాయంతో, ఈ సేవ మరింత విస్తరించేందుకు అవకాశముందని తెలిపారు.

ఆంధ్ర హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ రమణమూర్తి మాట్లాడుతూ, మహేశ్ బాబు ఫౌండేషన్ తో కలిసి మహిళల్లో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించే వ్యాక్సిన్‌పై పరిశోధనలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆరోగ్య సంరక్షణలో భాగంగా, మహిళలు మరియు చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు మహేశ్ బాబు ఫౌండేషన్ అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు. మదర్స్ మిల్క్ బ్యాంక్ ఎలా ఉపయోగపడుతుంది ప్రాంతంలోని ఆసుపత్రులు, చిన్నారుల ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన తల్లిపాలను ఈ బ్యాంక్ అందిస్తుంది. ఆహారం పొందలేని, పాలుబిడ్డలను పోషించలేని తల్లులకు ఇది గొప్ప ఉపశమనం. స్వచ్ఛందంగా పాల దానం చేసే తల్లులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావొచ్చు.విజయవాడలో మదర్స్ మిల్క్ బ్యాంక్‌ను ప్రారంభించిన నమ్రత శిరోద్కర్ తల్లి పాలను అందక ఇబ్బంది పడే శిశువులకు సహాయం చేయడమే లక్ష్యం మహేశ్ బాబు ఫౌండేషన్ %-% గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్‌పై పరిశోధనలు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా మహిళలు, చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి

# అర్జున్ సన్నాఫ్ వైజయంతి' టీజర్ విడుదల



ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో కల్యాణ్ రామ్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. తాజాగా ఈ చిత్రం సంబంధించిన టీజర్‌ను చిత్ర బృందం లాంచ్ చేసారు. తల్లి కొడుకుల మధ్య ఎమోషనల్, వైరం, ప్రేమ, సెంటిమెంట్ అని కలగలిపి ఈ సినిమా రూపొందినట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇందులో విజయశాంతి పవర్ ఫుల్ పోలీసాఫీసర్‌గా, ఆమె కొడుకు పాత్రలో కళ్యాణ్ రామ్ కనిపించాడు. తన కొడుకు పోలీసు ఆఫీసర్ అవ్వాలనే విజయశాంతి లక్ష్యానికి విరుద్ధంగా హింసా మార్గంలో వెళ్తాడు. దీంతో తల్లి, కొడుకుల మధ్య వైరం జరుగుతుంది. ఎంతో ప్రేమగా ఉండే తల్లి కొడుకులు దూరం అవ్వాల్సి వస్తుంది. వాళ్లిద్దరూ మళ్లీ ఎలా కలుసుకున్నారు? అనేదే ఈ సినిమాలో కీలకమైన మలుపు. ఇక ఇప్పటికే రిలీజైన టైటిల్ పోస్టర్, ఈ మధ్యనే వదిలిన ప్రీ-టీజర్ ఆడియన్స్‌ను విశేషంగా ఆకట్టుకున్నాయి.

TELUGU RASTRAM . Printed, Published and Owned by AITHABATHULA RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: AITHABATHULA RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339